ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో

జిల్లాకు మూడోస్థానం

నెల్లూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఈ రెండు జనరల్ విభాగాల్లోనూ జిల్లాకు రాష్ట్రస్థాయిలో మూడోస్థానం దక్కింది. ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో ప్రథమస్థానం, ద్వితీయసంవత్సరంలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. జిల్లాలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 6342 మంది పరీక్షకు హాజరుకాగా 3395 మంది ఉత్తీర్ణతతో 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం విభాగంలో 3469 మంది హాజరు కాగా 2677 మంది ఉత్తీర్ణతతో 77 శాతం ఉత్తీర్ణత పొందారు. అదేవిధంగా ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సరంలో 283 మంది హాజరు కాగా 200 మందితో ఉత్తీర్ణతతో 77 శాతం, ద్వితీయ సంవత్సరంలో 141 మంది హాజరు కాగా 128 మంది ఉత్తీర్ణతతో 91శాతం ఉత్తీర్ణత సాధించారు.

● రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి..

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు bie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సోమవారం

(మిగతా 7వ పేజీలో..)

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను శనివారం జిల్లాలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 6 నుంచి 8గంటల వరకు మసీదల్లో ప్రత్యేక ప్రార్థనలు, దువాలు జరిగాయి. బక్రీద్ గురించి మహ్మద్ ప్రవక్త ఖురాన్‌లో తెలిపిన విధంగా, త్యాగం, ప్రేమ సహనం పాటించాలని మతపెద్దలు తమ తమ ప్రసంగాల్లో వివరించారు. అన్నీ ఈద్గాల్లో ఉదయం 9 నుంచి 11.30గంటల వరకు సామూహికంగా జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియచేసుకున్నారు.

● మతసామరస్యం పాటిస్తున్న ముస్లింలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి భారతీయ ముస్లింలు దేశభక్తికి కట్టుబడి ఉన్నారని, మత సామరస్యం పాటిస్తున్నారని ఇమామ్ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి పిలుపునిచ్చారు. శనివారం దర్గామిట్ట బారాషహీద్ ఈద్గాలో బక్రీద్ నమాజ్ అనంతరం ఆయన సందేశం ఇచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోరాటం చేసి అశువులుబాసిన ముస్లిం దేశభక్తులను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సామూహిక ప్రార్థనలకు నగరం నలుమూలల నుంచి ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

సౌర విద్యుత్‌కు మరింత ప్రోత్సాహం

- సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీలు
- బీసీలకు అదనంగా రూ.20 వేలు
- ఐదు నుంచి ఆరు లక్షలమందికి లబ్ధి

జిల్లాలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను వినియోగదారులు ఎక్కువగా ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ఇస్తూ వినియోగదారులను ప్రోత్సహిస్తున్నది. అయినా ఆశించిన స్థాయిలో వినియోగదారులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి కేంద్రం ఇస్తున్న సబ్సిడీకి అదనంగా బీసీ వర్గాలకు మరో రూ.20 వేలు రాయితీని అందజేస్తున్నట్లు ప్రకటించింది.

నెల్లూరు (జడ్పీ), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహాలు, వాణిజ్య సముదాయాలు, వ్యవసాయానికి సంబంధించి 11 లక్షల మేర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటితోపాటు పరిశ్రమలకు కలిపి రోజుకి 15 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తున్న ది. రాష్ట్రంలో బొగ్గు, నీటితో ఉత్పత్తి అయ్యే కరెంటు డి మాండ్‌కు తగ్గట్లుగా లేదు. దీంతో వేసవిలో కోతలు తప్ప డం లేదు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం అధిక ధరలకు ప్రభుత్వం బయట రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయా ల్సి వస్తున్నది. ఆ భారం వినియోగదారులపైనే పడుతోంది. అయితే ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా అధిక డిమాండ్‌కు చెక్ పెట్టే అవకాశం ఉంది.

● బీసీలకు అదనపు సబ్సిడీ

జిల్లాలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తున్నది. దీంతో సుమారు 60 వేల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. వీరందరికి సూర్యఘర్ పీఎం ద్వారా సోలార్ విద్యుత్‌ను ప్రభుత్వమే ఉచితంగా ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నది. అలాగే బీసీ వర్గాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదనంగా రూ.20 వేల సబ్సిడీని అందించనుంది. కిలోవాట్ సోలార్ విద్యుత్ ఏర్పాటుకు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇందులో రూ.38 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా అందచేస్తున్నది. రెండు కిలోవాట్‌కి రూ.1.3 లక్షల నుంచి 1.4 లక్షల వరకు ఖర్చు అవుతోంది. అందులో రూ.60 వేలను కేంద్రప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. మూడు కిలోవాట్‌కి రూ.2.1 లక్షల నుంచి రూ.2.2 లక్షల వరకు ఖర్చు అవుతుండగా, అందులో రూ.78 వేలు కేంద్రం సబ్సిడీ అంద చేస్తుండగా దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.20 వేలు బీసీ వర్గాలకు సబ్సిడీని ఇవ్వనున్నది. బీసీ వర్గాలకు ఇది మరింత ఊరట నివ్వనున్నది. జిల్లాలో దాదాపుగా 5 లక్షల నుంచి 6 లక్షల వరకు బీసీ వర్గాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరందరికీ లబ్ధి చేకూరనున్నది.



సౌర విద్యుత్ పలకాలను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

● అవగాహన పెంచేలా ప్రత్యేక చర్యలు

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలుపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏపీ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) కే. గురవయ్య పిలుపునిచ్చారు. నగరంలోని విద్యుత్ భవన్ స్కాడా సమావేశ

(మిగతా 7వ పేజీలో..)

అల్లీపురంలో కంచి పీఠాధిపతి

● విఘ్నేశ్వర ఆలయ కుంభాభిషేకానికి హాజరు

నెల్లూరు (రూరల్/సాంస్కృతికం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని అల్లీపురంలో ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవానికి కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి హాజరయ్యారు. ఆలయ కమిటీ, భక్తులు ఘనస్వాగతం పలికారు. నూతన విగ్రహాలకు స్వామి అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. పీఠాధిపతి పర్యటన సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, అల్లీపురంలో ప్రతిష్ఠ అనంతరం నెల్లూరు చేరుకున్న కంచి స్వామికి జాతీయ రహదారి వద్ద భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. రాత్రికి మూలాపేటలోని శంకరమఠంలో విడిది చేసిన స్వామీజీ ఆదివారం ఉదయం బయలుదేరి వెళ్తారని తెలిసింది. ఏర్పాట్లను మఠం మేనేజర్ నందకిషోర్ దంపతులు పర్యవేక్షించారు.



కాకాణి... అదే మౌనం

రెండో రోజూ నోరు తెరవని మాజీ మంత్రి ● నేటితో ముగియనున్న పోలీసు కస్టడీ

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీలో రెండవరోజు శనివారం కూడా నోరుమెదపలేదని తెలిసింది. పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో ఏ4గా రిమాండ్‌లో ఉన్న కాకాణిని జిల్లా కేంద్ర కారాగారం నుంచి పోలీసు కస్టడీకు తీసుకున్న విషయం తెలిసిందే. కృష్ణపట్నం పోలీసు స్టేషన్‌లో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మధాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారణ సాగింది. పోలీసులు ఏ ప్రశ్న అడిగినా కాకాణి నాకు తెలియదు, గుర్తులేదు... అన్న సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ఆదివారం నాటితో కాకాణి పోలీసు కస్టడీ ముగియనుంది.

● ఇద్దరికి బెయిల్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన రుస్తుం మైన్స్ అక్రమాల కేసులో నిందితులుగా

(మిగతా 7వ పేజీలో..)

ఘనంగా మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు

తోటపల్లిగూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం గ్రామదేవత మహాలక్ష్మీ అమ్మవారికి గ్రామస్తులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. స్థానిక టీడీపీ నేత మనోహర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేనాటి శ్రీనివాసులు, విజయ్, నిరంజన్, శ్రీను, స్థానిక టీడీపీ నేతలు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9249
వెండి కిలో ధర	రూ. 108500
వెండి ఒక గ్రాము	రూ. 111.50

త్యాగానికి ప్రతీక బక్రీద్



కోవూరులోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బాలలు



బుచ్చి పట్టణంలోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మనుబోలులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పొదలకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని పొదలకూరు ముస్లిం మతాధికారి మౌలానా ముస్తక్ మదని అన్నారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● వెంకటాచలం : మండలంలోని ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కనుమూరు, ఇస్లాంపేట, సర్వేపల్లి తదితర గ్రామాల్లోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో పడమటి వాకిలి తెరిచారు. ప్రతి బక్రీద్ పండుగ నాడు ఈ వాకిలిని తెరుస్తారు. ఈ వాకిలి గుండా దర్గాలోకి వెళ్లి మస్తాన్‌స్వామి సమాధిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈనేపథ్యంలో పడమటి వాకిలి గుండా భక్తులు దర్గాలోకి వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు.

● మనుబోలు : బక్రీద్ సందర్భంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న మసీదుల్లో, ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానాలు చేశారు.

● కోవూరు : బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పడుగుపాడు, కోవూరుల్లోని గులేషావలి, టెక్కే దర్గాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సత్రం వీధిలోని పెద్దమసీదులో భక్తులకు అన్నదానం చేశారు. అన్ని దర్గాల్లో మత ప్రబోధకులు బక్రీదు విశిష్టతను వివరించారు.

● ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరులో మైనార్టీ నాయకులు షేక్.ఇంతియాజ్ ఆధ్వర్యంలో షాదీ మంజిల్‌లో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. జగదేవిపేట, కొరుటూరు, మైపాడు, ఇందుకూరుపేట, గంగపట్నం గ్రామాల్లో బక్రీద్ వేడుకలు ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాపూరు పట్టణంలో ఊరేగింపుగా ఈద్గాకు వెళ్తున్న ముస్లింలు

● విడవలూరు : త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే భక్రీద్ పండుగ మండలంలోని విడవలూరు, ముదివర్తి గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

● బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో త్యాగానికి ప్రతీకగా చెప్పబడే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. దీంతో ఈద్గాలు, మసీదుల ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బుచ్చి పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంతంలో పెద్ద మసీదు, ఖజానగర్, కొత్త బస్టాండ్, పాత కాశీపాళెం, తదితర ప్రాంతాలు, మండలంలోని రేబాల, పెనుబల్లి, దామరమడుగు, కాగులపాడు, నాగమాంబాపురం, ఇస్కపాళెం, మినగల్లు, కట్టుబడిపాళెం తదితర గ్రామాల్లో పలు మసీదుల్లో ఉదయం ముస్లింలు ప్రార్థనలు చేశారు. ముందుగా ముస్లిం మత పెద్దలు బక్రీదు పర్వదినంకు సంబంధించిన పలు సందేశాలను తెలియజేశారు. ప్రార్థనల అనంతరం పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● రాపూరు : బక్రీద్ పండుగను రాపూరు మండలంలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు పెద్ద మసీదు నుంచి ఊరేగింపుగా రాపూరు పట్టణ పురవీధుల గుండా ఈద్గాకు చేరుకుని ప్రార్థనలు చేశారు. రాపూరుతో పాటు పెనుబర్తి, ఓబులాయపల్లి గ్రామాల్లోను ఈద్గాలలో ప్రార్థనలు చేశారు.



రూ.2.40కోట్లతో సీసీరోడ్లు

● బండి రాజశేఖర్, పీఆర్ ఏఈ

మనుబోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 పంచాయతీల్లో రూ. 2.40 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈ బండి రాజశేఖర్ శనివారం తెలిపారు.

? సీసీ రోడ్ల నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి.

! మండలానికి 46 సీసీ రోడ్లు వచ్చాయి. వీటి విలువ సుమారు రూ.2.40కోట్లు ఉంటుంది. ఇప్పటికే 32 సీసీరోడ్లు పూర్తిచేశారు. 6 కిలోమీటర్ల సీసీ రోడ్లు ఉపాధిహామి నిధులతో జరుగుతున్నాయి.

? హాస్టళ్ళ మరమ్మతుల మాటేమిటి

! మనుబోలులో రెండు హాస్టళ్ళు ఉన్నాయి. అందులో ఎస్సీ బాలుర వసతిగృహం మరమ్మతులకు రూ. 5లక్షలు మంజూరయ్యాయి. దాదాపు పూర్తికావచ్చింది. బడులు తీసే సమయానికి పనులు పూర్తిచేస్తాం. ఎస్సీ బాలికల వసతిగృహంకు కొత్త హాస్టల్ రూ. 3కోట్లతో మంజూరైంది. అయితే అది ఇంకా టెండర్ కాలేదని తెలిసింది.

? ఆగిన సచివాలయాలు, ఆర్‌ఎస్‌కే భవనాల సంగతేమిటి.

! ఆగిన వాటి వివరాలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే పనులు చేయిస్తాం. పిడూరు పాళెంలో కొత్తగా అంగన్‌వాడీ భవనం రూ.10లక్షలతో మంజూరైంది. అయితే ఇంకా టెండర్ కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

శివాలయంలో ధ్వజారోహణం



కోవూరు శివాలయంలో ధ్వజస్తంభానికి చేస్తున్న అర్చకులు

కోవూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలలో బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచనగా ఆలయ పూజారులు శనివారం ధ్వజారోహణం చేశారు. అనంతరం కామాక్షి సమేత రామలింగేశ్వరునికి పూలంగి సేవ, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రధాని మోదీనీ కలిసిన కోవూరు వాసులు



ప్రధాని మోదీతో విజయభారతి, రామచంద్రా రావు కుటుంబ సభ్యులు

కోవూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీని పట్టణానికి చెందిన జాతీయ మానవహక్కుల సంఘం ప్రతినిధులు విజయభారతి-నరహరి మాధవరావు కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి న్యూఢిల్లీలో ప్రధాని అధికార నివాసంలో కలిశారు. ఆమె కుటుంబ సభ్యులతో పాటు సొంత సోదరుడు సాయిని రామచంద్రారావు కుటుంబం కూడా ప్రధానమంత్రిని కలిసింది. మోదీ అందర్నీ పరిచయం చేసుకుని అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, నెల్లూరు జిల్లా విశేషాల్ని ఆయన విజయభారతి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానిని కలిసిన విజయభారతి, సాయిని రామచంద్రారావు కుటుంబ సభ్యుల్ని బంధుమిత్రులు అభినందించారు.

కామాక్షితాయి సేవలో వేములపాటి



కామాక్షితాయిని దర్శించుకుంటున్న వేములపాటి అజయ్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో టిడ్కో ఛైర్మన్, నెల్లూరు జిల్లా జనసేన పార్టీ పర్యవేక్షకుడు వేములపాటి అజయ్ కుమార్ శనివారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి, సేవా కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సభ్యులు నక్క ల శివకృష్ణ, కే.శ్రీనివాసులు, అర్చకులు ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం గోత్ర నామములతో స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసా దములు అందజేశారు. స్వామి అమ్మవారి శేషవస్త్రములతో సత్కరించి వేదపండితులు ఆశీర్వచనములు అందజేశారు. ఆయన వెంట జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ సుంద రరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్, శ్రీరామ్, జమీర్, కృష్ణారెడ్డి, బుచ్చి మండల అధ్యక్షుడు మాధవ్, నాయకులు సురేష్, సురేంద్ర, మల్లి, జయరాం తదితరులు ఉన్నారు.

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి

ముత్తుకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పంటపాలెం గ్రామం రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో ఐఐఆర్ఆర్ కేంద్రం విభాగం శాస్త్రవేత్త నాగేశ్వరరావు, కేవీకే నెల్లూరు మత్స్య శాస్త్రవేత్త హరిసాధు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరీక్ష ఫలితాల ద్వారా అవసరమైన ఎరువులను వాడడం వలన నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చన్నారు. సమగ్ర చేపల పెంపకం గురించి హరిసాధు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జోత్స్న రాణి, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

●తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి మట్టి నమూనాల సేకరణ, నాణ్యమైన విత్తనాల ఎంపిక తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త కిరణ్ కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శిరిషరాణి, బ్యాంకింగ్ కోఆర్డినేటర్ రవిశంకర్, మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష, ఝాన్సీ, వైష్ణవి, ప్రసన్న, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ

పొదలకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను ఆ పార్టీ నాయకుడు, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అనీల్, విష్ణు, నవీన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం

రాపూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. నిత్య కల్యాణ మండపంలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిలతో స్వామివారికి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుచ్చి పల్లకి సేవ ఊంజల్ సేవ, క్షేత్రోత్సవం నిర్వహించామని ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఆలయ ఈవోకు చెక్కు అందచేస్తున్న రవీంద్రబాబు దంపతులు

రాపూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పెనుశిల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కలువాయి మండలం తోపుగుంట అగ్రహారానికి చెందిన భక్తులు ఏం రవీంద్రబాబు, శ్రీవేణి దంపతుల కుమారుడు అభయ్‌రామ్, కుమార్తె భవిత పేర్లు మీద రూ. 1,01,116 చెక్కును ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసుల రెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం కల్పించారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ఉపాధి హామీ పథకంపై అవగాహన ర్యాలీ

రాపూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోరేపల్లి గ్రామ పంచాయతీలో సామాజిక తనిఖీ డైరెక్టర్ జి శ్రీకాంత్ పర్యవేక్షణలో గ్రామస్థాయిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, జనసేన పార్టీ మహిళా కార్యకర్త కస్తూరి, ఏపీవో చంద్రయ్య, ఎఫ్ఏ మూర్తి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పిలు వై లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థుల హవా

పొదలకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో పొదల కూరులోని రామమందిరం వీధిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి విజయ దుందుభి మోగించారని కరస్పాండెంట్ ఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో జూనియర్ ఎంపీ సీకి చెందిన దేవుళ్ల నిత్య కృతిక 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించి స్టేట్ సెకండ్‌గా నిలువగా, ఎస్‌కె తస్లిమా 466 మార్కులతో స్టేట్ థర్డ్‌గా నిలిచిందన్నారు. అలాగే అదే గ్రూపులో సాయికీర్తి, హేమంత్, లిఖిత 464 మార్కులు కైవసం చేసుకోగా, త్రివేణి 462, సాయిరోహిత్, మేఘన 460 మార్కులు పొందారన్నారు. 16 మంది విద్యార్థులు 450 మార్కులకు పైగా సాధిం చారని కళాశాల ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి నారాయణరెడ్డి తెలిపారు. సీఈసీ నందిని 469 మార్కులతో మండలం ఫస్ట్‌గా నిలిచిందన్నారు. అనంతరం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో స్టేట్ సెకండ్, థర్డ్ స్థానాలు సాధించిన విద్యార్థులతోపాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థు లను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, చంద్రశేఖర్, అధ్యా పకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం కోసం మహిళల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేస్తున్న నరుకూరు పొదుపు గ్రూపు సభ్యులు

తోటపల్లిగూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని నరుకూరు పొదుపు సంఘం సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా పొదుపు గ్రూపు సభ్యులు మాట్లాడుతూ నరుకూరు వీవోఏ సాదేపల్లి సునీత అక్రమాలకు పాల్పడి రూ.14లక్షల పొదుపు సొమ్ము స్వాహా చేసిందని, ఆ సొమ్మును బ్యాంకులకు జమ చేయకుండా ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతోందని తెలిపారు. పోలీసులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని, జిల్లా ఎస్పీ స్పందించి ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

CRIME NEWS

గేదెను ఢీకొన్న మోటారు బైక్ : ఒకరి దుర్మరణం

కావలి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ గేదెను ఢీకొన్న ప్రమాదంలో ఊటుకూరి కృష్ణారావు(55) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి కావలి పట్టణం పెద్దపవని రోడ్డులోని సుచేతానగర్ సమీపంలో జరిగింది. స్థానికులు కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. లింగసముద్రం మండలం పెద్దపవనికి చెందిన కృష్ణారావు ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ ఇంటివద్ద కరెంటు సామాన్ల అంగడి నిర్వహిస్తున్నారు. కావలిలో కరెంటు సామాన్లు కొనుగోలు చేసుకుని బైక్‌పై పెద్దపవనికి వెళ్తుండగా మార్గమధ్యంలో సుచేతానగర్ దగ్గర రోడ్డుపై వస్తున్న గేదెలను ప్రమాదవశాత్తు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పద్మావతి ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతిచెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ (65) శుక్రవారం ఉదయగిరి పట్టణంలోని ఆనకట్టపై నడుచుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతిచెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

గేదెను ఢీకొన్న మోటారుబైక్

● ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రగాయాలైన కోటయ్య



తలకు తీవ్రగాయమైన శ్రీరాములు

సంగం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కలిగిరి రహదారిలో ఏఎస్‌పేట ఆర్చీకి సమీపంలో శనివారం రాత్రి రోడ్డు మీద ఉన్న గేదెను మోటారుబైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. మండలంలోని చెన్నవరపాడు గ్రామానికి చెందిన కోటయ్య, శ్రీరాములు మోటారు బైక్‌పై సంగం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో కలిగిరి రహదారి ఏయస్‌పేట ఆర్చీకి సమీపంలో రోడ్డు మీద ఉన్న గేదెలను ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి

కొడవలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రశేఖరపురం గ్రామంలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఈ సందర్భంగా డీటీ సారంగపాణి, వీఆర్వో సురేష్‌లు డంప్ చేసి ఉన్న రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. ఈ రేషన్ బియ్యాన్ని ఆదివారం సివిల్ సప్లయిస్ అధికారులు పంచనామా చేసి నిర్ధారించనున్నారని వారు తెలిపారు. వారి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు, కె.నాగేశ్వరరావు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో వజ్ర, స్వర్ణాభరణాల చోరీ

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఓ బస్సులో సూట్కేస్ పెట్టి వాష్‌రూమ్‌కు వెళ్లివచ్చే సరికి సూట్కేస్‌లోని నగల పెట్టెలో ఉన్న డైమండ్, బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... కర్నూలు ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి, వీరనారాయణమ్మ దంపతులు బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు గత నెల 15వ తేదీ పొదలకూరు వచ్చారు. వివాహం తర్వాత 19వ తేదీన వీరనారాయణమ్మ తన 150 గ్రాముల డైమండ్, బంగారు ఆభరణాలను బాక్స్‌లో పెట్టి సూట్కేస్‌లో పెట్టుకున్నారు. కర్నూలు వెళ్లేందుకు పొదలకూరు నుంచి నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు చేరుకున్నారు. అక్కడ బస్సు దిగి కర్నూలు బస్సు ఎక్కారు. సూట్కేస్‌ను బస్సులో ఉంచి వాష్‌రూమ్‌కు వెళ్లి వచ్చారు. మరుసటి రోజు కర్నూలులో బస్సు దిగి ఇంటికి వెళ్లారు. కొద్దిసేపటికి సూట్కేస్‌లోని నగల బాక్స్‌ను తెరిచి చూడగా అందులో ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె జరిగిన విషయాన్ని అదే రోజు ఫోన్ ద్వారా చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆమె అనారోగ్యంతో వైద్యశాలలో చేరారు. చికిత్స అనంతరం శనివారం చిన్నబజారు స్టేషన్‌కు వచ్చారు. తాను వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తి తన సీట్ వద్ద ఉన్నాడని, అతనే చోరీకి పాల్పడి ఉండవచ్చని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుపూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నెల్లూరులోని మన్సూర్ నగర్ ప్రాంతానికి చెందిన మున్నా, ఖాదర్ బాషాఇద్దరూ కలిసి దైవదర్శనం కోసం కసుమూరుకు వెళ్తుండగా కసుపూరు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా ఆటో ఒక్కసారిగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని కోటమిట్ట మున్సిపల్ వీధిలో నివసించే బీ వెంకటేష్‌కు అదే ప్రాంతానికి చెందిన నాని అలియాస్ చందుతో పాతగొడవలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వెంకటేష్ టీ తాగేందుకు వెళుతుండగా నాని అతని స్నేహితుడు శివ అడ్డుకుని దాడి చేశారు. గాయాలపాలైన బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స పొంది శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ అక్రమాల కేసులో రిమాండ్ తిరస్కరణ

నెల్లూరు (లీగల్), (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గ్రావెల్ తరలింపు అభియోగాలపై సీబీసీఐడీ పోలీసులు మాజీ మంత్రి కాకాణి ముఖ్య అనుచరుడు అల్లంపాటి నిరంజన్‌రెడ్డి అరెస్ట్ చేసి నెల్లూరు రెండవ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి పీ. వినోద్ శనివారం హాజరు పరిచారు. 41 ఏసీఆర్‌పీసీ నిబంధనలు పాటించలేదనే కారణంతో న్యాయాధికారి రిమాండ్‌ను తిరస్కరిస్తూ నిరంజన్‌రెడ్డిని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 540

ఎస్బీఐ ఉద్యోగుల రక్తదానం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 7(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎస్బీఐ టౌన్ బ్రాంచిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యూనియన్ నెల్లూరు రీజియన్ ఆధ్వర్యంలో ఆ యూనియన్ పూర్వ కార్యదర్శి వై తారక్‌నాథ్ 21వ వర్ధంతి సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాడ్యూల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేయూఎస్ఎన్ మూర్తి, రాస్‌మెక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కే జితేంద్ర, నెల్లూరు రీజియన్ కార్యదర్శి ఎం సనత్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పీ గిరిధర్, వివిధ శాఖల కార్యదర్శులు శశి, మనోజ్, నరేంద్ర, ప్రసాద్, సుప్రీమ్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్బీఐ స్టాఫ్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

న్యూస్ బాక్స్

'చేజర్ల'కు పరామర్శ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు, ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తల్లి మరణించటంతో శనివారం పలు సంఘాల నాయకులు హరనాథపురంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. మానవ సేవయే మాధవ సేవ టీం నిర్వాహకులు అరవ పరిమళ, ఆర్ ఇందిర, అరుణరాణి, రాజ్యలక్ష్మి, వైద్యఆరోగ్యశాఖ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కల్వం శ్రీనివాసులు, హంస జిల్లా కార్యదర్శి కమల్ కిరణ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జాషువా గ్రంథాలయాన్ని పూర్తి చేయించండి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గుర్రం జాషువా గ్రంథాలయ నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయించాలని ఆ గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ బీద రవిచంద్రను కోరారు. ఈ మేరకు వారు శనివారం ఎమ్మెల్సీకి ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం, సభ్యులు కొమ్మల కృష్ణయ్య, గంధం అంకయ్య, ఏవీ సుబ్బారావు, జనార్దన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లా సింహాచలం మృతి బాధాకరం

● ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద

నెల్లూరు(హరనాథపురం), జూన్ 7(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణం బాధాకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. 1994లో విశాఖపట్నం-2 నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆ నియోజకవర్గం అభివృద్ధికి, టీడీపీ బలోపేతానికి సింహాచలం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పల్లా శ్రీనివాసరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొదలకూరు రోడ్డు వెడల్పు కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఈఈ ఎం శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదలకూరు రోడ్డు వెడల్పు కారణంగా క్యాన్సర్ హాస్పిటల్, జడ్పీ కాలనీ, సారాయి అంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీ నగర్, గౌతమి నగర్, ప్రగతి నగర్, పొదలకూరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

11న పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. నెల్లూరులోని మనం ఆసుపత్రిలో శనివారం ఆ సంఘం ప్రతి నిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఈనెల 11న డిజీపీ కల్యాణ మండపంలో ఈకార్యక్రమం నిర్వహించేలా సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని చెప్పారు. ఈసమావేశంలో ఆసంఘం నాయకులు సోమగోపాల్, జానపాటి రామసుబ్బయ్య, గుత్తికొండ శ్రీనివాసులు, మునగపాటి రమేష్, చింతలపూడి పెంచలయ్య, డాక్టర్లు మారం సుధాకర్, మారం మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 11 కోట్లతో 'చంద్రన్న పల్లె పండుగ'

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి రూ. 11 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించి చంద్రన్న పల్లెపండుగ కార్యక్రమం ద్వారా ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం దొంతాలి, ఆమంచర్ల, ఉప్పుటూరు, సౌత్‌మోపూరు గ్రామాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మలినేని వేణునాయుడు, వెంకయ్య నాయుడు, రాపూరు చంద్రశేఖర్, పముజుల ప్రదీప్ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

సాయికుమార్‌కు ఘన నివాళి



సంతాపసభలో పాల్గొన్న ప్రముఖులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగు అధ్యాపకుడు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త బత్తిన సాయికుమార్‌రెడ్డి సంతాపసభ శనివారం ఘనంగా జరిగింది. నగరంలో పురమందిరంలో జరిగిన ఈ సభను శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాల్గొన్న వక్తలు సాయికుమార్‌రెడ్డి గురించి మాట్లాడుతూ అధ్యాపకుడిగా, సామాజికవేత్తగా ఎందరో విద్యార్థులను సామాజిక సేవా కార్యకర్తలుగా తయారుచేశారని కొనియాడారు. నగరంలో స్వామివివేకానంద అంటే గుర్తుకు వచ్చేది సాయికుమార్‌రెడ్డేనని తెలిపారు. నగరంలో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటులో ఆయన చేసిన కృషిని అభినందించారు. సభా ప్రాంగణంలో ఆయన కళ్లజోడు, చేతి గడియారం, ఇతర వస్తువులను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు నూరరాజు మదన్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, కాకుమురళీరెడ్డి, ఉడతా శ్రీనివాస్ యాదవ్, అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై సైకిల్ యాత్ర

నెల్లూరు (వైద్యం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు నెల్లూరుకు చెందిన అరిగెల సాయిరాం(60) జిల్లాలో సైకిల్ యాత్ర చేపట్టారు. మే 8న రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా ప్రారంభమైన యాత్ర ములుముడి, జొన్నవాడ, బుచ్చి, వెంకటాచలం, కొడవలూరు, రాజుపాళెం, అల్లూరు ప్రాంతాల్లో పర్యటించి వేయి కిలోమీటర్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్‌లో సాయిరాంకు సన్మానం జరిగింది. రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబు, అడ్వైజర్ మలిరెడ్డి కోటారెడ్డి సాయిరాంను శాలువా, పుష్పమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కోటరెడ్డి మాట్లాడుతూ వేసవి సైతం లెక్కచేయకుండా 60 ఏళ్ల వయసులో రక్తదానంపై సైకిల్ యాత్ర చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి మెడికల్ అధికారి డాక్టర్ వరప్రసాద్, రెడ్‌క్రాస్ మెడికల్ షాపు కన్వీనర్ మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అరిగెల సాయిరాంను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నోరు తెరవని కాకాణి

(ఐదో పేజీ తరువాయి)

రిమాండ్‌లో ఉన్న వారిలో ఇద్దరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు ముందస్తు బెయిలు తీసుకోగా, ఏ4గా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నారు. ఏ6గా ఉన్న వేమిరెడ్డి అరవింద్ కుమార్‌రెడ్డి నాలుగు రోజుల క్రితమే బె యిల్‌పై విడుదలయ్యారు. ఏ7 కరుణాకర్‌రెడ్డి, ఏ8 శివారెడ్డికి హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు శనివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.

ఇంటర్ సప్లిమెంటరీలో మూడో స్థానం

(ఐదో పేజీ తరువాయి)

నుంచి ఈ నెల 13వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.260లు, రీ వెరిఫికేషన్(స్కాన్ చేసిన కాపీ) ఒక్కో పేపర్‌కు రూ.1300లు చెల్లించాలన్నారు. అభ్యర్థులు సెప్టంబరు 10వతేదీ లోపల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

సౌర విద్యుత్‌కు మరింత ప్రోత్సాహం

(ఐదో పేజీ తరువాయి)

మందిరంలో శనివారం నెల్లూరు రూరల్ విద్యుత్ డివిజన్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి పథకాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, తక్షణమే వోల్టేజ్ స్థిరీకరణకు అవసరమైన ఇంప్రూమెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం బుజబుజనెల్లూరు విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించారు. అక్కడ విద్యుత్ సరఫరా, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ వి విజయన్, ఈఈ సోమశేఖర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈ ట్రాన్స్‌ఫార్మర్స్ లక్ష్మీనారాయణ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య

పంచాయతీలకు చేరని చేపల ఆదాయం

● ఆరు నెలలైనా ఖాతాలకు జమ చేయని పాటదారులు ● ఉదారంగా వ్యవహరిస్తున్న కార్యదర్శులు
● గ్రామాల్లో ఖర్చుకు డబ్బుల్లేక ఇక్కట్లు

నెల్లూరురూరల్, జూన్7(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పంచాయతీ ఆదాయానికి వనరులుగా ఉన్న చెరువుల్లోని చేపల వేట వేలం నగదు పంచాయతీల ఖజానాకు చేరడంలేదు. చెరువులను దక్కించుకునే క్రమంలో వేలం పాట జరిపిన సమయాల్లో కొంత చెల్లిస్తున్న పాటదారులు తదుపరి నగదును నెలలు గడుస్తున్న పంచాయతీలకు చేర్చడం లేదు దీంతో ప్రజల అవసరాలకు తగ్గట్టు ఖర్చులను భరించలేని దుస్థితి ఏర్పడుతుంది. పాటదారుల నుంచి నిర్ణీతకాల వ్యవధిలో నగదు వసూళ్ళు చేయించాల్సిన పంచాయతీ కార్యదర్శులు ఉదారంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలుండగా, మండల స్థాయి అధికారులు పూర్తిగా పర్యవేక్షణ బాధ్యతల్లో చేతులెత్తే శారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. బహిరంగ వేలం నిర్వహించి ఆరు నెల లు గడుస్తున్నా ఇప్పటికీ పంచాయతీ ఖాతాలకు పూర్తిగా నగదు చేరకపోవడం గమనార్హం.

నెల్లూరురూరల్ మండలంలో గొల్లకందుకూరు, సజ్జాపురం, కొత్తవెల్లంటి, పాతవెల్లంటి, కందమూరు, ములుముడి గ్రామాలలో చెరువుల్లోని చేపలు పట్టుకునే హక్కుల విక్రయం ద్వారా భారీగా స్థానిక పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. కాగా సజ్జాపురం, కొత్త, పాతవెల్లంటిల్లో వేలం పాటల ద్వారా హక్కులు పొందిన వారు పూర్తి మొత్తాన్ని పంచాయతీ ఖాతాలకు జమచేసేయగా, ములుముడిలో సిద్దిచెరువులో చేపల పట్టుకునే హక్కులను రూ. 7.50 లక్షలకు జనవరిలో సొంతం చేసుకున్నారు. కానీ అందులో రూ. 3.75 లక్షలు మాత్రమే పంచాయతీకి జమ చేసిన పాటదారుడు మిగిలిన మొత్తాన్ని నేటికీ చెల్లించలేదు. కందమూరులోని చెరువుకు రూ. 5 లక్షలతో హక్కులు పొందిన వ్యక్తి రూ. 3.95 లక్షలు చెల్లించి సరిపెట్టుకోగా మిగిలిన రూ. 1.05 లక్షలు చెల్లించాల్సి ఉంది. అటు గొల్లకందుకూరులో పెద్దచెరువునురూ. 15.55 లక్షలుకు చేపలు పట్టుకునే హక్కుల ద్వారా సొంతం చేసుకుని రూ. 7.77 లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తం చెల్లించాల్సి ఉండగా, అటు చిన్న చెరువును రూ. 3.87 లక్షలకు పాడుకున్న వ్యక్తి రూ. లక్ష చెల్లించి సరిపెట్టుకోగా మిగిలిన రూ. 2.87 లక్షలు పంచాయతీకి జమ చేయాల్సి ఉంది.



చెరువులో చేపలు పడుతున్న కూలీలు



ఎగుమతికి సిద్ధం చేస్తున్న చేపలు

● పట్టుకోల్పోతున్న అధికారులు

గ్రామాలలో నిత్యం ప్రజలకు అవసరమైన సేవలను పంచాయతీ నిధుల ద్వారానే తీర్చాల్సి ఉంది. ఇందులో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లతో పాటు అనేక సమస్యలకు పంచాయతీ పాలకవర్గమే జవాబుదారీ. నిత్యం ఖర్చులతోకూడిన వైనం. కానీ చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కుల ద్వారా ప్రత్యక్ష ఆదాయం పంచాయతీలకు వచ్చే అవకాశాలు న్నా వాటిని నిర్ణీత కాలవ్యవధిలో జమ చేసుకునేందుకు పర్యవేక్షణ లేక వనరులను రాబట్టుకోవడంలో పట్టుకోల్పోతున్నారంటే విమర్శలు వినిపిస్తున్నాయి. బహిరంగ వేలం పూర్త యిన 24 గంటల్లో సగం నగదు చెల్లించి మిగిలినది 15 రోజుల నుంచి 30 రోజుల్లో పంచాయతీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కానీ రూరల్ మండలంలోని గ్రామాలలోని చెరువులకు జనవరిలో బహిరంగ వేలం నిర్వహించారు. 6 నెలలు గడుస్తున్నా పాటదారుల నుంచి పూర్తనగదును పంచాయతీ ఖాతాలకు జమచేయించకపోవడంపై కార్యదర్శులు, మండలస్థాయి అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

10న కోటంరెడ్డి సోదరులకు అవార్డు ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రూరల్ నియోజకవర్గంలో 399 అభివృద్ధి పనులు 60 రోజుల్లో పూర్తి చేసి, ఒకే గంటలో ప్రారంభోత్సవాలు నిర్వహించి అరుదైన రికార్డును రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు సాధించారని టీడీపీ నాయకులు బర్నాబాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వారి సేవలను గుర్తించి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డులను ఆ సంస్థలు ఈనెల 10న ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ అవార్డుల కార్యక్రమం కస్తూరిదేవి విద్యాలయంలోని ఠాగూర్ ఫంక్షన్ హాలులో ఆరోజు సాయంత్రం 6గంటలకు జరుగుతుందని తెలిపారు.

ఘనంగా షష్టిపూర్తి వేడుక

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి) : టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరందూరు సురేంద్రబాబు, సమత దంపతుల షష్టిపూర్తి వేడుకలు శనివారం రాత్రి జరిగాయి. ఈ వేడుకల్లో నగర ప్రముఖులు, టీడీపీ నేతలు పాల్గొని అభినందించారు.

10న ప్రత్యంగిరా సహిత చండీ హోమం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న మహామృత్యుంజయేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 10న ప్రత్యంగిరా సహిత చండీ హోమం జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా గణపతి పూజ, ప్రత్యంగిర, చండీ అమ్మవార్లకు కలిశ పూజలు, అనంతరం హోమం జరుగుతాయని తెలిపారు. దేశానికి శత్రు భయం తొలగి, సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆరోగ్యం సిద్ధించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న హోమానికి భక్తులందరూ హాజరుకావాలని కోరారు.

ట్రాఫిక్ దారి మళ్లింపు

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆనం వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఆదివారం నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని నగర డీఎస్పీ పీ. సింధుప్రియ శనివారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం వరకు మాగుంటలేవుట్ నుంచి వచ్చే వాహనాలు రామలింగాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జీ మీదుగా, శ్రీహరి నగర్ వైపు నుంచి ముత్యాలపాలెం మీదుగా వెళ్లాలన్నారు. వీఆర్సీ వైపు నుండి ముత్తుకూరు, ఆత్మకూరు బస్టాండు వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ముత్తుకూరు బస్టాండు నుంచి ఎస్2 కాంప్లెక్స్ వైపు మళ్లించామన్నారు. ఆత్మకూరు బస్టాండు నుంచి మాగుంటలేవుట్, ముత్తుకూరు వైపు వెళ్ల ట్రాఫిక్‌ను మినీ బైపాస్‌లోని గుర్రాల మడుగు బ్రిడ్జి నుంచి బాలాజీనగర్, చిల్డ్రన్స్‌పార్క్ వైపుకు మళ్లించడం జరిగిందన్నారు. నగర ప్రజలు ట్రాఫిక్ మళ్లింపులను గమనించి సహకరించాలని కోరారు.

హైరిస్క్ గర్భిణులకు సుఖప్రసవం

నెల్లూరు (వైద్యం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో హైరిస్క్ గర్భిణులకు సుఖప్రసవాలు చేయిస్తున్నామని ప్రముఖ గర్భకోశ వ్యాధులు నిపుణురాలు డాక్టర్ సీతాలక్ష్మి, డాక్టర్ మంజూషలు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రసవానంతరం తల్లి,బిడ్డల ఆరోగ్య సంక్షేమ కోసం ప్రత్యేకంగా వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. తల్లి గర్భంలో బిడ్డ ఆరోగ్య బాగాలేక పోతే ప్రసవ సమయంలో కొన్ని సార్లు తల్లి మరణం, బిడ్డ మరణం సంభవిస్తుందన్నారు. దీన్నే హైరిస్క్ గర్భం అంటారని అలాంటి వారికి మెడివకర్‌లో అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. రక్తపోటు, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు వంటి వ్యాధులు కారణంగా మహిళలకు హైరిస్క్ గర్భం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి అత్యుత్తమ వైద్యం అందించాల్సి ఉంటుందని తెలిపారు. హెచ్ఐవీతోపాటు హైపటైటిస్, లైంగిక వ్యాధులు, మాదకద్రవ్యాలు, మద్యపానంకు గురయ్యే మహిళలు గర్భవతులయితే దాన్ని హైరిస్క్ గర్భంగా నిర్ధారించి ప్రత్యేక చికిత్సలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలియచేశారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక పూజలు

బిట్రగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం ఊంజలసేవా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



జడ్పీ సీఈవో విద్యారమకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో

నరసింహుడి సేవలో జడ్పీ సీఈవో విద్యారమ

వలేటివారిపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం జడ్పీ సీఈవో విద్యారమ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో విద్యారమ మాట్లాడుతూ ఆలయ ప్రకృతి సౌందర్య బాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

నెల్లూరు (వైద్యం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ పాలన కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ఆరోపించారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలన ఆశ బారెడు.. ఆచరణ మూరెడు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. కృష్ణపట్నం పోర్టు, విశాఖ ఉక్కు కర్మాగారంలో కార్మికులను విధుల నుంచి తొలగించారని, రాష్ట్రంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు అండగా కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని, ఇందులో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు టీవీవీ ప్రసాద్, అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో నరసింగరావు, ప్రసాద్, అజయ్‌కుమార్ తదితరులు

అన్నదాన సమాజం హాస్టల్‌లో
ప్రవేశానికి 28 వరకు గడువు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పప్పులవీధిలో పాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఈ నెల 28వరకు స్వీకరిస్తామని సమాజం కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి 6వతరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునే పేద ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారి జాబితాను 29వతేదీన ప్రకటిస్తారన్నారు. పూర్తి వివరాలకు 0861- 2328427, 83309 58427 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.



అశ్వవాహనంపై చాముండేశ్వరి

ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో చాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి)

మెదడులో గడ్డలు ముప్పే!

● గుర్తిస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలి
● లేదంటే ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే..
● రేడియేషన్, సెల్‌ఫోన్‌ల వల్ల ముప్పు
● క్యాన్సర్ కణుతులుగా మారుతున్న వైనం
● జిల్లాలో 1200మందిపైగా బాధితులు
● నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే



నెల్లూరు (వైద్యం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నేడు అనేక శారీరక,మానసిక రుగ్మతలు మానవుడిని పట్టి పీడిస్తున్నాయి. వివిధ వ్యాధులను నిర్లక్ష్యం వల్ల ప్రాణాలకే ముప్పు వస్తున్నది. ప్రత్యేకించి శరీర అవయవాలను నియంత్రించే మెదడులో గడ్డలు (ట్యూమర్) వస్తే అవి ప్రమాదమే. జిల్లాలో ఇలాంటి వ్యాధిగ్రస్థులు పెద్దసంఖ్యలో ఉన్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. మెదడులో ఒక అవయవాన్ని నియంత్రించే భాగంలో గడ్డ వస్తే అది ఆ అవయవంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఆ అవయవాలు చచ్చుబడే ప్రమాదం ఉంది. ఇందులో అత్యంత ప్రమాదకరంగా భావించే గియో బ్లపోమా మల్టిఫార్మా(జీబీఎం) కణుతులు ఏర్పడితే దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ముందుగానే వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స చేయించుకోకపోతే, ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. మెదడు గడ్డల్లో దాదాపు 120 రకాలు ఉంటాయి. మెదడులో అది వచ్చిన ప్రాంతాన్ని బట్టి దీని ప్రభావం ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాధిపై అవగాహన కలిగించేలా ప్రతి ఏటా జూన్ 8న (నేడు) ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్స్ డేగా పాటించాలని నిర్ణయించింది.

● జిల్లాలో 1200 మందికిపైగా బాధితులు

జిల్లాలో దాదాపు 1200 మందికిపైగా బ్రెయిన్ ట్యూమర్ బాధితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా రేడియేషన్ స్థాయి నేటి వాతావరణంలో ఎక్కువగా ఉండడంతో బ్రెయిన్ ట్యూమర్‌లకు ఇదే ప్రధాన కారణంగా ఉంటున్నది. నేటి ఆధునిక తరం సెల్‌ఫోన్ లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి. దీని నుంచి వెలువడే రేడియేషన్ కూడా ఈ ట్యూమర్‌లకు మరో కారణంగా తాజా అధ్యయనంలో తేలినట్లు మేధావులు వెల్లడిస్తున్నారు. మొబైల్ ఫోన్‌లు ఎక్కువగా వాడే వారిలో గ్లయోమా తరహాలో మెదడులో గడ్డలు వచ్చేందుకు అవకాశం ఎక్కువగా ఉన్నట్లు ఇటీవల పరిశోధనల్లో వెల్లడయింది. అందుకే 16 ఏళ్ల వయసున్న పిల్లలకు మొబైల్ ఫోన్‌లను ఇవ్వక పోవటం మంచిది. వయసుతో నిమిత్తం లేకుండా బ్రెయిన్ ట్యూమర్‌లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. రొమ్ము, పెద్దప్రేగు, మూత్రపిండాల క్యాన్సర్‌లు సోకిన సందర్భాలలో వారిలోని 20 నుంచి 40 శాతం కేసుల్లో అవి మెదడుకు పాకి అక్కడ క్యాన్సర్ గడ్డలు ఏర్పడుతున్నాయి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..!

- మేనరికాల పెళ్లిళ్లకు దూరంగా ఉండాలి.
- కుటుంబంలో ఎవరికైనా బ్రెయిన్ ట్యూమర్ ఉంటే కుటుంబ సభ్యులంతా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.
- అధిక రేడియేషన్ విడుదల చేసే సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి.
- వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

అప్రమత్తత అవసరం

బ్రెయిన్ ట్యూమర్‌లపై ఎలాంటి నిర్లక్ష్యం వద్దు. కుటుంబ సభ్యులలో ఎవరికైనా బ్రెయిన్ ట్యూమర్ ఉంటే మిగిలిన వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. మెదడులో కణుతులను గుర్తిస్తే ఎంతటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలు అయినా సరే విజయవంతంగా చేసి ప్రాణాలు కాపాడవచ్చు. సెల్‌ఫోన్ వల్ల కూడా రేడియేషన్ ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరమైతే తప్ప సెల్‌ఫెన్ వాడొద్దు. వీలైనంత దూరంగా ఉండటం మంచిది. ఆధునిక వైద్య పరికరాలయిన న్యూరో నావిగేషన్, క్యూసా వంటి వాటి ద్వారా బ్రెయిన్ ట్యూమర్లను గుర్తించి చికిత్సలు చేసే వీలుంది. ట్యూమర్ క్యాన్సర్ సెల్‌కు ఆక్సిజన్, బ్లడ్ సప్లయ్ ఆపేసి చేసే ట్యూమర్ నివారణ చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి.



- డాక్టర్ ధీరజ్, న్యూరోసర్జన్, జీజీహెచ్.

షైనింగ్ స్టార్స్‌గా 273 మంది విద్యార్థులు

● రేపు ప్రతిభా పురస్కారాల ప్రదానం

నెల్లూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా గుర్తించి నగదు ప్రోత్సాహకంతో సన్మానించేందుకు పాఠశాల విద్యా శాఖ సన్నద్ధమైంది. జిల్లాలో మొత్తం 273 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకంతోపాటు మెడల్, ప్రశంసా పత్రం అందచేయనుంది. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను కూడా సన్మానించి ప్రోత్సహించేందుకు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 237 మంది విద్యార్థులను, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 36 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అన్ని పాఠశాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారినే ఎంపిక చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. సంబంధిత తేదీలో విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరై అవార్డులు అందుకోవాలని కోరారు.

నేడు సీనియర్ సిటిజన్ల యోగాంధ్ర

● ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 7(ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్ల కోసం ఆదివారం ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇన్ చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. శనివారం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, రామచంద్ర మిషన్, చిల్డ్రన్స్‌పార్కు తదితర చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో సీనియర్ సిటిజన్లు పెద్దసంఖ్యలో పాల్గొనేలా చూడాలని కోరారు. సోమవారం యోగాంధ్ర బ్యానర్‌తో ప్రతి గ్రామంలో ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఈనెల 10న ఉదయగిరిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

అన్న ప్రసాదంలో
నాణ్యత లోపిస్తే సహించం

● మాలకొండలో అధికారులపై మండిపడ్డ మంత్రి ఆనం
● పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు

వలేటివారిపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మాలకొండ క్షేత్రంలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలోని మహా అన్నదానసత్రంలో భక్తులకు రుచికరమైన భోజనం పెట్టాలని, అందులో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హెచ్చరించారు. శనివారం మాలకొండకు చేరుకున్న ఆయన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఆయన కొత్తగా చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా మండలంలోని చుండి నుంచి అమ్మపాలెం మీదుగా గాంధీనగర్ వరకు నాబార్డు నిధులతో రూ.2.20 కోట్లతో నిర్మించిన తారురోడ్డును ప్రాంభించారు. అనంతరం మాలకొండలో కొండ కింద రూ.1.56కోట్లతో చేపట్టనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు, రూ.2.65 కోట్లతో చేపటనున్న డార్మిటరీ హాలుకు, రూ.46.50 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కొండపైన రూ.80 లక్షలతో నిర్మించిన 5 వసతి గదులు, రూ.2.40 కోట్లతో నిర్మిచిన రిటైనింగ్‌వాల్, రూ.77 లక్షలతో నిర్మించిన ఎస్ఎస్ క్యూలైన్‌ను ప్రారంభించారు. మాలకొండకు వచ్చిన మంత్రి రామనారాయణరెడ్డికి ఆలయ అధికారులు మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువా పూలమాలతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేశారు.


మాలకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

● భోజనం నాణ్యతపై మంత్రి అసంతృప్తి

మాలకొండలోని మహా అన్నదానసత్రంకు చేరుకున్న మంత్రి భక్తులతో కలిసి భోజనం రుచి చూశారు. ఆ సమయంలో బజ్జీ, కూరలు లేకపోవడంతో ఆలయ అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులను మందలించారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ భక్తులకు రుచి, శుచితో పాటు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. భక్తుల అంచనాలకు అనుగుణంగా అన్నం కూరలు తయారు చేయాలని తెలిపారు. అనంతరం ఆలయ అధికారులు, అన్నదానంలో పనిచేసే సిబ్బందితో విడివిడిగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు, డీఎస్పీ సుబ్రహ్మణ్యం, సీఐ మంగారావు, ఎస్ఐ మరిడినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని వీరయ్య, చెరువుపల్లి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.14,98,455

మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ. 14,98,455 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌లకు రూ.9,550, కుంకుమార్చనకు రూ.19,680, వివాహములకు రూ.5వేలు, తలనీలాలకు రూ.85,800, వాహన పూజలకు రూ.4,680, ప్రత్యేకదర్శనంకు రూ.5,41,000, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.540, రూముఅద్దెలు రూ.31,330, కవర్ల విక్రయంతో రూ.11,100, లడ్డూప్రసాదానికి రూ.2,46,580, అన్నదానం ద్వారా రూ.5,21,595, విరాళములు రూ.21,600 లభించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ కౌన్సెలింగ్ గందరగోళం

● అర్ధరాత్రి వరకు పడిగాపులు
● సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు
● ప్రణాళిక లేని విద్యాశాఖ
● నేడు డీఈవో కార్యాలయం ముట్టడి


అర్ధరాత్రి కౌన్సెలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు గందరగోళంగా మారాయి. అభ్యంతరాలు, అవరోధాలు, పాయింట్ల కేటాయింపుల్లో తేడాలు... ఇలా ఒక్కటి కాదు అన్ని విషయాల్లోనూ విద్యాశాఖ పూర్తిగా విఫలమైనట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రణాళిక లేకుండా, ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం కూడా రాత్రి ప్రారంభమైన కౌన్సెలింగ్ శనివారం తెల్లవారుఝామున మూడు గంటల వరకు నిర్వహించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● ప్రణాళిక ఏదీ ?

అర్హులైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఎస్‌జీటీలకు పీఎస్ హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహించకపోవడంతో తిప్పలు తప్పలేదు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ రాత్రి 10 గంటలకు ప్రారంభమైంది. నగరపాలక, పురపాలక, ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులకు సర్టిఫికెట్‌ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆరంభం నుంచి వివిధ రకాల అభ్యంతరాలతో ఉపాధ్యాయులు, సంఘాలు వీటిని అడ్డుకున్నాయి. దీంతో ఉపాధ్యాయులంతా రాత్రి సమయాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటూనే కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీటన్నింటిని సరిచేస్తూ తెల్లవారుఝాముకు ప్రక్రియను ముగించారు.

● పేరుకే ఆన్‌లైన్...

ఉపాధ్యాయ బదిలీల్లో ఆన్‌లైన్ విధానం గందరగోళ పరిస్థితులకు దారితీస్తోంది. సాంకేతిక సమస్యలతో అవరోధాలను ఎదుర్కొంటుండడంతో కౌన్సెలింగ్ ఆలస్యమవుతోందని అధికారులు తెలిపారు. పాఠశాల సహాయకులకు కొంతమందికి వెబ్ ఆప్షన్‌ల మేరకు బదిలీలు జరగ్గా, మరికొందరికి మ్యాన్యువల్‌గా నిర్వహించారు. ఉత్తర్వులు జనరేట్ కాకపోవడంతోనే కొందరికి మాన్యువల్‌గా నిర్వహించామని సిబ్బంది చెపుతున్నారు. అయి తే దీనిలో కూడా అవకతవకలు జరిగాయని ఉపాధ్యాయు లు ఆరోపిస్తున్నారు. క్లస్టర్ పాఠశాలల్లో సీనియర్స్ కంటే జూనియర్స్‌కే స్థానాలు దక్కాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో ఉత్తర్వులు జనరేట్ అయిన వారిలో సీనియారిటీ ముందున్న వారికంటే వెనుక ఉన్నవారికి అనుకూల ప్రదేశాలు రావడంపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● నేడు ముట్టడి

ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చి నేడు మాట తప్పి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం ఉదయం డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు ప్రకటించారు. శనివారం జరిగిన సమావేశంలో నేతలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌ల వెబ్ కౌన్సెలింగ్ ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగోన్నతులకు వెబ్‌ఆప్షన్‌లు పెట్టలేని పరిస్థితుల్లో మాన్యువల్ నిర్వహించాల్సి వచ్చిందన్నారు. దీనివలన ఉపాధ్యాయులు ఎన్నడూ లేని విధంగా మానసిక క్షోభ అనుభవించారని ఐక్యవేదిక నేతలు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌లకు వెబ్ ఆప్షన్‌లలో కనిపించిన క్లస్టర్ వేకన్సీలు ఎక్కువ పాయింట్లు వచ్చిన వారికి కాకుండా ప్రిఫరెన్షియల్ కేటగిరి వాళ్లు జనరల్ కేటగిరీ కింద స్థానాలను కేటాయించకపోవడం, బాలికోన్నత పాఠశాలల్లో పురుషులను కేటాయించడం వంటి వింతలు జరిగాయన్నారు. ఇంతగా విఫలమైన ఈ వెబ్‌కౌన్సిలింగ్ విధానాన్ని ఎస్‌జీటీల మీద బలవంతంగా రుద్దుతున్నారని, ఉపాధ్యాయులు ఎవరూ కూడా వెబ్ ఆప్ష న్ పెట్టకుండా కౌన్సెలింగ్‌ను బాయ్‌కా ట్ చేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్దకు వేలాదిగా ఉపాధ్యాయులు తరలిరావాలని, కౌన్సెలింగ్ ప్రక్రియను మార్చే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఎ.సురేంద్ర రెడ్డి, పీ.అనిల్‌కుమార్, జీవీ చలపతి శర్మ, కే నరసింహులు, వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అధునాతనంగా
వీఆర్ హైస్కూలు

పేద విద్యార్థుల చదువుకు సన్నద్ధం
మాట నిలుపుకున్న మంత్రి నారాయణ
12న ప్రారంభం... వేయిమందికి ప్రవేశం
ఈ ఏడాది నర్సరీ నుంచి 9వ తరగతి వరకు..


మోడల్‌గా రూపుదిద్దుకున్న వీఆర్ హైస్కూల్


పిల్లల కోసం మైదానంలో ఆట వస్తువులు

నెల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పిడికెడు మెతుకులకు అవస్థలుపడే పేదపిల్లల కోసం ఓ సుందరమైన పాఠశాల పురుడు పోసుకుంది. మురికి కాలువలు, మట్టి దిబ్బల మధ్యన సేదతీరే నిరుపేద పిల్లలను అక్కున చేర్చుకొని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి చదువుల తల్లి నిలయం సిద్ధంగా ఉంది. రాష్ట్రంలోనే దశాబ్దాలపాటు పేరొందిన వెంకటగిరి రాజులు స్థాపించిన చదువుల బడి(వీఆర్ హైస్కూల్) ఐదేళ్ల మరణం నుంచి మంత్రి నారాయణ కృషితో కొత్త జీవం నింపుకుంది. ఆయన ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీ నెరవేర్చే క్రమంలో మూడు నెలల క్రితం మొదలైన వీఆర్సీ పాఠశాల ఆధునికీకరణ పూర్తయ్యాయి. ఈనెల 12న ఈ పాఠశాల పునఃప్రారంభం కానున్నది.

● కార్పొరేట్‌ను తలదన్నేలా..

పేదపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కొత్తరూపు సంతరించుకున్న వీఆర్ హైస్కూల్ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే స్థాయిలో ఉంది. వసతులపరంగా, బోధనపరంగా, ఆటపాటల పరంగా అన్ని విధాలుగా కార్పొరేట్‌ను మించిన రీతిలో రూపుదిద్దుకుంది. అన్ని తరగతులకు డిజిటల్ బోధన ఉంటుంది. ఇందుకోసం ప్రతి క్లాస్ రూంలో విశాలమైన డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గది విద్యార్థుల మనస్సులకు హత్తుకునేలా అందంగా తీర్చిదిద్దారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులను ఎంపిక చేస్తున్నారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎక్కడా కనిపించని విధంగా వీఆర్ హైస్కూల్‌లో క్రీడామైదానం సిద్ధమైంది. ఫుట్‌బాల్, టెన్నీస్, షటిల్, వాలీబాల్, బ్యాస్కట్ బాల్ కోర్టులను సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించారు. నర్సరీ పిల్లల కోసం ప్రత్యేకంగా లాన్‌తో మైదానం సిద్ధం చేశారు.

● అన్నీ ఉచితమే..

ఇక్కడ చదివే పిల్లలకు అన్నీ ఉచితమే. ఫీజులు ఉండవు. పుస్తకాలు, యూనిఫాం అన్నీ ఉచితంగానే ఇస్తారు. అంతే కాదు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇస్తారు. పాఠశాలకు రానుపోను ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారు. ఈ ఏడాది 1 నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు ఉంటాయి. మరుసటి సంవత్సరం 10, ఆ తరువాత ఇంటర్ ఫస్టియర్, ఆ తరువాత ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు తరగతులు పెంచుతారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం వచ్చే సరికి వీఆర్సీలో ఐదు వేలమంది పేద విద్యార్థులు చదువుకునేలా ప్రణాళికలు రూపొందించారు. నిరుపేద పిల్లలకు మాత్రమే ఈ స్కూల్‌లో అడ్మిషన్లు కల్పిస్తారు. బీడి కార్మికులు, పాచిపని చేసి జీవనం సాగించే వారు, హమాలీలు.. ఇలా నిరుపేద వర్గాలకు చెందిన పిల్లలను గుర్తించి వారికి మాత్రమే ఈ పాఠశాలలో అడ్మిషన్లు ఇస్తారు. విద్యార్థుల ఎంపిక బాధ్యతను జాయింట్ కలెక్టర్, వీఆర్ విద్యాసంస్థల ప్రత్యేక అధికారి కే కార్తీక్ పర్యవేక్షిస్తున్నారు.

సోమశిలలో 40.712 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 40.712 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 270 క్యూసెక్కులు వస్తుండగా పెన్నాడెల్టాకు 3,250, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9249
వెండి కిలో ధర	రూ. 108500
వెండి ఒక గ్రాము	రూ. 111.50

గ్రామాల్లో జోరుగా జూదం

● తోటలు, అడవులే పేకాట స్థావరాలు ● పట్టించుకోని పోలీసులు

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో జూదం జోరుగా సాగుతోంది. తోటలు, అడవులు పేకాటస్థావరాలుగా మారిపోయాయి. కొంతమంది పేకాటస్థావరాల నిర్వాహకులుగా మారి రోజుకు వేలకు వేల రూపాయలు గడిస్తున్నారు. జూద గాళ్లకు సమయానికి మందు, భోజనం అందించడంతో పాటు పోలీసుల కదలికలను చేరవేస్తున్నారు. జూదాలను అడ్డుకోవాల్సిన వారే ఆడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఎక్కువగా పొలాలు, అడవులను పేకాట స్థావ రాలుగా మార్చి ఎవరికీ అనుమానం రాకుండా రోజుకో చోట స్థావరం ఏర్పాటుచేస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పేకాట ఆడుతున్నారు. అందులో రమ్మీ, లోపల బయట, మూడు ముక్కల ఆట ఆడుతుంటారు. ఇలా రోజుకు పేకాటలో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. పోలీసులు ఏమైనా వస్తారేమోనని స్థావరాలకు దూరంగా కొందరిని కాపలాగా ఉంచి వారికి రోజూ వేతనం చెల్లిస్తారు. ఇక మందు, సిగరెట్, స్నాక్స్, భోజనం తెచ్చేందుకు మరో మనిషిని ఏర్పాటు చేస్తారు. ఆట సజావుగా జరిగితే నిర్వాహకుడు, కాపలా, సరఫరా చేసే వ్యక్తికి వేలకువేలు అందజేస్తారు. ఇటీవల జిల్లాలో పలు జూద స్థావరాలపై పోలీసులు దాడులు చేసి రూ.లక్షల్లో నగదు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జూద స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచి నివారించాలని పలువురు కోరుతున్నారు.



పోలీసుల దాడిలో పట్టుబడిన పేకాటరాయుళ్లు (ఫైల్)



దుర్వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

● ఎస్‌ఐ ఏ శ్రీనివాసులు

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉదయగిరి ఎస్‌ఐ ఏ శ్రీనివాసులు సూచించారు. సక్రమ మార్గంలో పయనించి సమాజాభివృద్ధికి తోడ్పడి లక్ష్యాలను సాధించాలన్నారు.

? యువతకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి.

! సమాజంలో కొంతమంది యువకులు గంజాయి, ఇతరత్రా మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువత మంచి జీవితాన్ని ఎంచుకోవాలి.

? చోరీల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! చోరీలు జరగకుండా మావంతు కృషి చేస్తున్నాం. రాత్రి సమయాల్లో పట్టణం, గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. ఊరెళ్లే వారికి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

? ప్రమాదాల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు.

! ప్రమాదాల నివారణకు వాహన దారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నాం.

వాడవాడలా భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాలలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఆత్మకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆత్మకూరు పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు చేయగా, మత గురువులు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. మండల కేంద్రమైన ఆత్మకూరుతో పాటు మహిమలూరు, బట్టేపాడు, కరటంపాడు, నాగులపాడు తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఖుర్బానీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

●అనంతసాగరం: మండలంలోని సోమశిల, అనంతసాగరం, ఉప్పలపాడు, కచ్చేరిదేవరాయపల్లి, ఆమనిచిరివేళ్ల, పాతదేవరాయపల్లి, ముస్తాపురం గ్రామాల్లో శనివారం ముస్లింలు బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గా ప్రాంగణాలకు చేరుకొని ప్రార్థనలు చేశారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని పేదలకు దాన ధర్మాలు చేశారు.

●ఏఎస్ పేట: ఏఎస్ పేటతోపాటు చిరమన, అనుమసముద్రం, హసనపురం, రాజవోలు, గుంపార్లపాడు తదితర గ్రామాలలో శనివారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏఎస్ పేటలోని దర్గా ఆవరణలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



సీతారామపురం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

●సంగం : మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద ఇమామ్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. సంగం, తలుపూరుపాడులో ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. సిద్దీపురం, దువ్వూరు, జెండాదిబ్బ, మర్రిపాడు, కోలగట్ల, తరుణవాయి తదితర గ్రామాలోని మసీదులలో ప్రార్థనలు చేశారు.

●చేజర్ల: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన చేజర్లతో పాటు ఆదురుపల్లి, మడపల్లి, చిత్తలూరు, తిమ్మాయిపాళెం, ఉలవపల్లి, పుట్టుపల్లి, పెరుమాళ్ళపాడు, మాముడూరు, టి.కే.పాడు, మడపల్లి తదితర గ్రామాలలోని ముస్లింలు ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చేజర్లలో జరిగిన ప్రార్థనలలో మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

●ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు శనివారం బక్రీద్ పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయగిరి పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద మత పెద్దలు ఖురాన్ సందేశం ఇచ్చారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు జేశారు.

●దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు, నర్రవాడ, నందిపాడు, లక్ష్మీపురం, తురకపల్లి, ఏరుకొల్లు తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దానధర్మాలు చేయడంతోపాటు ఖుర్బానీ అందజేశారు.

●వింజమూరు : బక్రీదు పండుగను స్థానిక ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముక్తి మౌలానా నిజాం ఆధ్వర్యంలో ఈద్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● సీతారామపురం : బక్రీద్ వేడుకలను మండలంలోని ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలు తనిఖీ చేసి పత్రాలు సక్రమంగా లేని వాటికి అపరాధ రుసుం విధించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ప్రతిఒక్కరు లైసెన్సు కలిగి ఉండాలని, ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని, మద్యం సేవించి ప్రమాదాలకు గురికావద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలుపోతేనే స్పందిస్తారా..!

● విద్యుత్ అధికారులపై ప్రజల ఆగ్రహం

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు పోతేనే స్పందిస్తారా.. అని విద్యుత్ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఆ సమయంలో కట్ట ఎత్తును పెంచడంతో అక్కడున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిగువకు చేరింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని, మూగజీవాలు సైతం మృత్యువాతపడుతున్నాయని, మరోచోటకు మార్చాలని, లేదంటే కంచె ఏర్పాటు చేయాలని సంబంధిత విద్యుత్ శాఖాధికారులకు ప్రజలు పలుమార్లు విన్నవించినా పెడచెవిన పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఓ మహిళ ఆనకట్టపై నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడడంతో మంటలు చెలరేగి తీవ్ర గాయాలై మృత్యువాత పడింది. దీంతో ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకు రాత్రికిరాత్రే విద్యుత్ సిబ్బంది అక్కడున్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటుచేశారు. అది చూసిన ప్రజలు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా విద్యుత్ అధికారుల తీరుందని విమర్శిస్తున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

రోడ్డుప్రమాదంలో బాలుడికి గాయాలు

కలువాయి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ బాలుడికి గాయాలైన సంఘటన శనివారం మదన్నగారిపల్లె సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి నుంచి దర్శికి తుఫాన్ వాహనం వెళ్తుండగా రాపూరు మండలం తెగచర్ల నుంచి ఆత్మకూరుకు వస్తున్న కారు వెనుకనుంచి ఢీకొంది. ఈప్రమాదంలో కారులో ఉన్న బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.

ఆత్మారామస్వామికి శేషవాహన సేవ



శేషవాహనంపై విహరిస్తున్న ఆత్మారామస్వామి

సంగం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సీతాదేవి, ఆత్మారామస్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమంలో తెలంగాణ యువతుల నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న కోటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం అంకురారోహణ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గంగా పార్వతీ సమేత కోటేశ్వర స్వామికి మంగళ వాయిద్యాల నడుమ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కందికట్టు సాయిబాబా, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



సీతారాముల గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వింజమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని జీటీకేఆర్ ఎస్టీ కాలనీలో జరుగుతున్న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా శనివారం విగ్రహాల జలాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 4గంటలకు స్వామివారి గ్రామోత్సవం జరిగింది. సాయంత్రం నిత్యహోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధాన అర్చకులు గంగాధర స్వామి, సురేష్, తేజ తదితరుల ఆధ్వర్యంలో జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత ఐదు రోజులుగా ఎన్‌ఎంయూఏ చేపడుతున్న నిరసన కార్యక్రమం శనివారం ముగిసింది. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం సమస్యలు పరిష్కరించే వరకూ దశల వారీగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, శంకర్, నాగరాజు, రమణయ్య, జ్యోతి, నాగమణి, సుజాత, కోటేశ్వరరావు, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలుగా మార్పు

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్పు చేసినట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి, దాసరిపల్లి ప్రాథమికోన్నత, ఉదయగిరి ఉర్దూ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. కావున ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ 9, 10వ తరరగతి విద్యార్థులు కూడా తమ పాఠశాలల్లో చేరవచ్చని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఆత్మకూరు పట్టణ సమీపంలో నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట్రావుపల్లికి చెందిన ఇద్దరు మృతిచెందగా, వారి కుటుంబాలకు శనివారం ఒక్కొక్కరికి రూ. 25 వేలు వంతున నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దగుమాటి శివకోటారెడ్డి పాల్గొన్నారు.

నేడు సోమేశ్వరాలయ పనులకు శంకుస్థాపన



సోమేశ్వరస్వామి ఆలయం(ఫైల్)

అనంతసాగరం జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద ఉన్న ప్రముఖ సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్, ఏవో ప్రసాద్‌రెడ్డి తెలిపారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో శంకుస్థాపన నిర్వహిస్తున్నట్లు, భక్తులు పాల్గొనాలని వారు కోరారు. మరలా ఆలయానికి పూర్వవైభవం వస్తుందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S

గేదెను ఢీకొన్న మోటారు బైక్ : ఒకరి దుర్మరణం

కావలి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ గేదెను ఢీకొన్న ప్రమాదంలో ఊటుకూరి కృష్ణారావు(55) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి కావలి పట్టణం పెద్దపవని రోడ్డులోని సుచేతానగర్ సమీపంలో జరిగింది. స్థానికులు కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. లింగసముద్రం మండలం పెద్దపవనికి చెందిన కృష్ణారావు ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ ఇంటివద్ద కరెంటు సామాన్ల అంగడి నిర్వహిస్తున్నారు. కావలిలో కరెంటు సామాన్లు కొనుగోలు చేసుకుని బైక్‌పై పెద్దపవనికి వెళ్తుండగా మార్గమధ్యంలో సుచేతానగర్ దగ్గర రోడ్డుపై వస్తున్న గేదెలను ప్రమాదవశాత్తు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పద్మావతి ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉదయగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతిచెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ (65) శుక్రవారం ఉదయగిరి పట్టణంలోని ఆనకట్టపై నడుచుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతిచెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

గేదెను ఢీకొన్న మోటారుబైక్

● ఇద్దరికి తీవ్ర గాయాలు

సంగం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కలిగిరి రహదారిలో ఏఎస్‌పేట ఆర్చీకి సమీపంలో శనివారం రాత్రి రోడ్డు మీద ఉన్న గేదెను మోటారుబైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. మండలంలోని చెన్నవరపాడు గ్రామానికి చెందిన కోటయ్య, శ్రీరాములు మోటారు బైక్‌పై సంగం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో కలిగిరి రహదారి ఏయస్ పేట ఆర్చీకి సమీపంలో రోడ్డు మీద ఉన్న గేదెలను ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రగాయాలైన కోటయ్య



తలకు తీవ్రగాయమైన శ్రీరాములు

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి

కొడవలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రశేఖరపురం గ్రామంలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఈ సందర్భంగా డీటీ సారంగపాణి, వీఆర్వో సురేష్‌లు డంప్ చేసి ఉన్న రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. ఈ రేషన్ బియ్యాన్ని ఆదివారం సివిల్ సప్లయిస్ అధికారులు పంచనామా చేసి నిర్ధారించనున్నారని వారు తెలిపారు. వారి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు, కె.నాగేశ్వరరావు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో వజ్ర, స్వర్ణాభరణాల చోరీ

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఓ బస్సులో సూట్కేస్ పెట్టి వాష్‌రూమ్‌కు వెళ్లివచ్చే సరికి సూట్కేస్‌లోని నగల పెట్టెలో ఉన్న డైమండ్, బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.... కర్నూలు ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి, వీరనారాయణమ్మ దంపతులు బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు గత నెల 15వ తేదీ పొదలకూరు వచ్చారు. వివాహం తర్వాత 19వ తేదీన వీరనారాయణమ్మ తన 150 గ్రాముల డైమండ్, బంగారు ఆభరణాలను బాక్స్‌లో పెట్టి సూట్కేస్‌లో పెట్టుకున్నారు. కర్నూలు వెళ్లేందుకు పొదలకూరు నుంచి నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు చేరుకున్నారు. అక్కడ బస్సు దిగి కర్నూలు బస్సు ఎక్కారు. సూట్కేస్‌ను బస్సులో ఉంచి వాష్‌రూమ్‌కు వెళ్లి వచ్చారు. మరుసటి రోజు కర్నూలులో బస్సు దిగి ఇంటికి వెళ్లారు. కొద్దిసేపటికి సూట్కేస్‌లోని నగల బాక్స్‌ను తెరిచి చూడగా అందులో ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె జరిగిన విషయాన్ని అదే రోజు ఫోన్ ద్వారా చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆమె అనారోగ్యంతో వైద్యశాలలో చేరారు. చికిత్స అనంతరం శనివారం చిన్నబజారు స్టేషన్‌కు వచ్చారు. తాను వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తి తన సీట్ వద్ద ఉన్నాడని, అతనే చోరీకి పాల్పడి ఉండవచ్చని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నెల్లూరులోని మన్సూర్ నగర్ ప్రాంతానికి చెందిన మున్నా, ఖాదర్ బాషాఇద్దరూ కలిసి దైవదర్శనం కోసం కసుమూరుకు వెళ్తుండగా కసుమూరు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా ఆటో ఒక్కసారిగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కోటమిట్ట మున్సిపల్ వీధిలో నివసించే బీ వెంకటేష్‌కు అదే ప్రాంతానికి చెందిన నాని అలియాస్ చందుతో పాతగొడవలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వెంకటేష్ టీ తాగేందుకు వెళుతుండగా నాని అతని స్నేహితుడు శివ అడ్డుకుని దాడి చేశారు. గాయాలపాలైన బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స పొంది శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ అక్రమాల కేసులో రిమాండ్ తిరస్కరణ

నెల్లూరు (లీగల్), (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గ్రావెల్ తరలింపు అభియోగాలపై సీబీసీఐడీ పోలీసులు మాజీ మంత్రి కాకాణి ముఖ్య అనుచరుడు అల్లంపాటి నిరంజన్‌రెడ్డి అరెస్ట్ చేసి నెల్లూరు రెండవ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి పీ. వినోద్ శనివారం హాజరు పరిచారు. 41 ఏసీఆర్‌పీసీ నిబంధనలు పాటించలేదనే కారణంతో న్యాయాధికారి రిమాండ్‌ను తిరస్కరిస్తూ నిరంజన్‌రెడ్డిని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100) : 540

నరసింహుడి సేవలో జడ్పీ సీఈవో విద్యారమ



వలేటివారిపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం జడ్పీ సీఈవో విద్యారమ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో విద్యారమ మాట్లాడుతూ ఆలయ ప్రకృతి సౌందర్య బాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అటకెక్కిన

'లిఫ్ట్ ఇరిగేషన్'

● గత టీడీపీ ప్రభుత్వంలో నిధుల మంజూరు ● గత వైసీపీ హయాంలో రద్దు

● కూటమి పాలనలోనైనా కార్యరూపం దాల్చేనా? ● ఆశగా ఎదురు చూస్తున్న రైతులు



కొత్తపల్లి చెరువులో అక్కడక్కడ ఉన్న నీరు

కావలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చెంతనే సోమశిల నీరు.. కానీ సమీపం పొలాలకు సాగునీరు అందక రైతుల అవస్థ.. ఈ పరిస్థితిలో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. అయితే ఆ తరవాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని అటకెక్కించింది. దీంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అయినా ఈ పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతుందా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కావలి మండలంలో 17 పంచాయతీలు ఉండగా వాటిలో 13 పంచాయతీలకు సోమశిల నీరు అందుతోంది. కొత్తపల్లి, ఆర్సీపాలెం, చలంచర్ల, అడవిల క్ష్మీపురం పంచాయతీలు మెట్ట పంచాయతీలుగా రైల్వే ట్రాక్‌కు పడమర వైపున ఉన్నాయి. ఆ పంచాయితీల పరిధిలోని చెరువులు కేవలం వర్షాధారంపై ఆధార పడి ఉన్నాయి. వాటికింద పంటలు సాగు చేస్తే అవి పండేవరకు నమ్మకం లేక పంట చేతికి వచ్చే సమయంలో చివరి తడి నీరు తగ్గి పంటలు ఎండి పోతోన్నాయి. దీంతో రైతులు ఆరుగాలం కష్టపడి సాగుచేసుకున్న పంటలు చేతికందక తీవ్రంగా నష్టపోతున్నారు. ఆయా పంచాయతీల రైతులు తమకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సోమశిల జలాలు అందిస్తే సాగు చేసుకున్న పంటలు చేతికందుతాయనే నమ్మకం ఏర్పడుతోంది. దీంతో ఎన్నాళ్లగానో రైతులు కావలి కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మంజూరు చేసి తమ ప్రాంత పొలాలకు సోమశిల జలాలు అందించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో గత టీడీపీ ప్రభుత్వంలో బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్రలు ప్రత్యేక చొరవ తీసుకుని ఆ 4 పంచాయతీలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సోమశిల జలాలు అందించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. అందులో భాగంగా అధికారులను తీసుకు వచ్చి ఆయా ప్రాంతాలను పరిశీలించడంతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సోమశిల జలాలు అందించేందుకు సాధ్యమవుతోందని



కావలి చెరువుకు సోమశిల నీరు వెళ్లే కావలి కాలువ



నీరు లేని చలంచర్ల చెరువు

గుర్తించి రూ.42 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు అనుమతులు ఇచ్చింది. అయితే దానికి టెండర్లు పిలిచే తరుణంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అప్పట్లో టెండర్లు నిలిపివేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారమార్పిడి జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

● అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాన్ని మనం కొనసాగిస్తే ఆ పేరు వారికే వస్తుందని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని అటకెక్కించింది. దగదర్తి విమానశ్రయం లాగా దానిని కూడా కొంత కాలానికి రద్దు చేయించింది. దీంతో రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. రైతులు ఎన్ని పర్యాయాలు వైసీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించక పోవడంతో ఆ పథకం వైసీపీ పాలనలో మరుగున పడింది.

● యువగళంలో లోకేష్ దృష్టికి..

మళ్లీ కూటమితో కలిసి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఆశలు పెట్టుకున్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా కొత్తపల్లికి వచ్చిన యువ నాయకుడు నారా లోకేష్‌కు ఈ పథకం గురుంచి, దాని ఆవశ్యకతను తెలయచేస్తూ మళ్లీ మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. దీంతో ఆయన రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పునరుద్ధరిస్తానని రైతులకు అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో దానిని పునరుద్ధరించాలని ప్రభుత్వ పాలకులను రైతులు కోరుతున్నారు. ఈ పథకం పునరుద్ధరణ జరిగితే మండలంలోని అన్ని పంచాయతీలకు సోమశిల జలాలు అందించినట్లవుతోంది. దీంతో రైతులకు మండలంలో సాగునీటి సమస్య శాశ్వతంగా పరిస్కారమయ్యే అవకాశాలు ఉన్నాయి.

31వ ఎమ్మార్పీఎస్ దినోత్సవానికి సన్నాహక ఏర్పాట్లు



కరేడు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్రబాబు

ఉలవపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే గ్రామాల్లోని ఎమ్మార్పీఎస్ శ్రేణులను సమాయత్తం చేస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి నరేంద్రబాబు మాదిగ తెలిపారు. శనివారం కరేడులోని అరుంధతి కాలనీలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో జూలై 7న జెండాలు ఆవిష్కరణ కోసం దిమ్మెలను ఆధునీకరించడం, జెండా దిమ్మెలు లేని చోట నూతన ఏర్పాట్లు జరిగేలా చూసెందుకు ఎస్సీ కాలనీల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈనెల 11వ తేదీన కందుకూరులో గ్రామ, మండల కమిటీల నిర్మాణం కొరకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ ఎంఎస్‌పీ రావినూతల ముత్తు మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు రావినూతల ఐజాక్, కరేటి గోపాల్, పున్నెపల్లి శ్రీనివాసులు, ఏలియా, వినయ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ తిరుపతి రీజియన్ నాయకుడు ఎస్ఎస్ మూర్తి, తదితరులు

కావలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ వై. తారకనాథ్ 21వ వర్ధంతిని పురస్కరించుకుని ఆ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్‌బ్రాంచ్‌లో జరిగిన ఈ శిబిరాన్ని ఎస్‌బీఐ యూనియన్ తిరుపతి రీజియన్ నాయకుడు ఎస్ఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకనాథ్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది సమస్యల పరిష్కారానికి యూనియన్ తరుపున ఎనలేని సేవలు అందించారన్నారు. ఎక్కువ మంది రక్త దాతలను తీసుకువచ్చిన ముంగమూరు మాజీ సర్పంచు యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం వైద్యాధికారిణి రమ్య, ఎస్‌బీఐ యూనియన్ నాయకులు గిరిధర్, శ్రీనివాసులురెడ్డి, జ్యోత్స్న, సుమన, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు టీ. శ్రీనివాసరావు, ప్రకాశరావు, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి ఆనం అభినందన

కందుకూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుకు ఎంపికైన విద్యార్థులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. శనివారం కందుకూరు పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. మండల పరిధిలో షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులకు 8 మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో ఐదుగురు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల భాస్కరరావు, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



కలిగిరిలో కురుస్తున్న వర్షం

కలిగిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం కురిసిన వర్షం ప్రజానీకానికి కాసింత ఉపశమనం కలిగించింది. ఎండవేడిమికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఓ మోస్తరు వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. దీంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.

ప్రసన్నుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఊంజల సేవలో స్వామి అమ్మవార్లు

బిట్రగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం ఊంజల సేవా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని స్వామి అమ్మవార్లను పూజించారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, అర్చకులు సత్యనారాయణ చార్యులు, భక్తులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏడాది కాలంలో హామీలన్నీ నెరవేర్చాం

● షాపింగ్ కాంప్లెక్స్‌కు మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఇంటూరి భూమి పూజ



కందుకూరు అంకమ్మ ఆలయంలో షాపింక్ కాంప్లెక్స్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖలో ఇచ్చిన ప్రతి హామీని గత ఏడాది కాలంలో నెరవేర్చామని, రాష్ట్రంలో అనేక దేవాలయాల పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు ఖర్చు చేశామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం కందుకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపనులు, ప్రారంభోత్సవాల్లో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులో కలిసి ఆయన పాల్గొన్నారు. కందుకూరులో గ్రామదేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన షాపింగ్ క్లాంప్లెక్స్‌కు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఆర్టీసీ ఆవరణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ చేశారు. తొలుత అంకమ్మ ఆలయంలో జరుగుతున్న అనివేటి మండపం నిర్మాణ పనులను పరిశీలించి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో కంటే 30 శాతం అధికంగా భక్తులు ఆలయాలను దర్శించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో 6ఏ కేటగిరిలో ఉన్న 148 ఆలయాలకు గాను 70 ఆలయాల్లో నిత్య అన్నప్రసాద కార్యక్రమాలు ప్రారంభించామని, వీటిలో మాలకొండ దేవస్థానం కూడా ఉందని తెలిపారు. వీలైనంత త్వరలోనే మిగిలిన ఆలయాల్లో కూడా నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రాంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చి పత్రి హామీని నెరవేర్చే క్రమంలో గ్రామీణ ప్రాంతాల ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు పూజార్లకు రూ.10,000 ఇస్తున్నామని, అర్చకుల సంభావనను రూ.10 వేలుకు పెంచామని తెలిపారు. అలాగే వేదం చదివి ఉన్న 6000 మంది వేద పండితులకు నెలకు రూ.3000 చొప్పున నిరుద్యోగ సంభావన మంజూరు చేశామన్నారు.

అంకమ్మ ఆలయానికి గాలిగోపురం నిర్మాణానికి చర్యలు

ఎంతో వైభోవంగా నిర్మాణం జరిగిన కందుకూరు అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులను త్వరలో పూర్తిచేసేలా జర్యలు తీసుకోవడంతోపాటు ఏడు అంతస్తుల రాజగోపురం నిర్మాణంకు కూడా దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి ఆనం ప్రకటించారు. పట్టణం నడిబొడ్డున ఉన్న అమ్మవారి ఆలయానికి ఆదాయం వనరులు పెంచే క్రమంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని పట్టణ పెద్దలు, ఎమ్మెల్యే నిర్ణయించడం శుభపరిణామం అన్నారు. ఈ కాంప్లెక్స్‌లో షాపులు నిర్వహించేవారు లీజుదారులే కానీ హక్కుదారులు కాదని, అమ్మవారే హక్కుదారుగా ఉంటారని అయన తెలిపారు. అమ్మవారికి నిత్య కైంకర్యాలు, ఆగమన శాస్త్రం ప్రకారం వైభవంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే ప్రతి సంవత్సరం జతార నిర్వహించేందుకు అందరి అభిప్రాయాలు సేకరించి ఒక విధానం రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నోరు తెరవని కాకాణి

(5వ పేజీ తరువాయి)

రిమాండ్‌లో ఉన్న వారిలో ఇద్దరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు ముందస్తు బెయిలు తీసుకోగా, ఏ4గా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నారు. ఏ6గా ఉన్న వేమిరెడ్డి అరవింద్ కుమార్‌రెడ్డి నాలుగు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యారు. ఏ7 కరుణాకర్‌రెడ్డి, ఏ8 శివారెడ్డికి హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు శనివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.


ఇంటర్ సప్లిమెంటరీలో 3వ స్థానం

(5వ పేజీ తరువాయి)

నుంచి ఈ నెల 13వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.260లు, రీ వెరిఫికేషన్(స్కాన్ చేసిన కాపీ) ఒక్కో పేపర్‌కు రూ.1300లు చెల్లించాలన్నారు. అభ్యర్థులు సెప్టంబరు 10వతేదీ లోపల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

సౌర విద్యుత్‌కు మరింత ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య

మందిరంలో శనివారం నెల్లూరు రూరల్ విద్యుత్ డివిజన్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి పథకాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, తక్షణమే వోల్టేజ్ స్థిరీకరణకు అవసరమైన ఇంప్రూ మెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం బుజబుజ నెల్లూరు విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించారు. అక్కడ విద్యుత్ సరఫరా, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ వి విజయన్, ఈఈ సోమశేఖర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈ ట్రాన్స్‌ఫార్మర్స్ లక్ష్మీనారాయణ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్



కావలిటౌన్ : దైవ సందేశానిస్తున్న ముఫ్తీ ఖలీల్ అహ్మద్

కావలిటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని ముఫ్తీ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని శనివారం పట్టణంలోని జామియా (పెద్ద)మసీద్, వైకుంఠపురంలోని మదీనా మసీద్ ఈద్గాలో, కసాయి వీధిలోని అక్సా మసీద్, ఇస్లాంపేటలోని సున్నతల్ మసీద్, అహ్లె ఆదీస్ మసీద్, కచ్చేరిమిట్టలోని మసీద్, వెంగళరావునగర్‌లోని ఈద్గా మసీదుల్లో ఉదయం 6-30 నుంచి 8-30 గంటల వరకు భక్తిశ్రద్ధలతో బక్రీద్(ఈదుల్‌జుహ)ప్రార్థనలు ఆచరించారు. నమాజ్ అనంతరం పిల్లలు పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. మత పెద్దలు తమ దైవ సందేశాలు అందించారు.

● **కావలి రూరల్ :** మండలంలోని గ్రామాల్లో ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద బక్రీదు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిరిపురం, ఆర్సీపాలెం, సర్వాయపాలెం తదితర గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగం, స్నేహం, పవిత్రత, దయాగుణానికి ప్రతీతగా పేదలకు ఖుర్బానీ పంచి పెట్టారు.

● **అల్లూరు :** త్యాగాలకు ప్రతీకగా నిర్వహించే బక్రీదు వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అన్ని మసీదులు, ఈద్గాల్లో మత పెద్దలు ఈద్ అల్ అదాహ్ నమాజును నిర్వహించారు. నమాజులు పూర్తయిన అనంతరం ఖుర్బానీ కార్యక్రమాన్ని చేపట్టారు. గోధుమ రొట్టెలను తయారు చేసి పేదలకు పంపిణీ చేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● **లింగసముద్రం :** లింగసముద్రం, పెంట్రాల, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, చినపవని, పెదపవని గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి నమాజు చేశారు. ప్రవక్తలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు.

● **కొండాపురం :** మండలంలోని సాయిపేట, రేణమాల, నేకునాంపేట, కొండాపురం, కొమ్మి, భీమవరప్పాడు, తూర్పుఎర్రబల్లి, గరిమెనపెంట తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి నమాజు చేశారు.

● **కలిగిరి :** బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దర్గాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందువులలు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

● **బిట్రగుంట :** బోగోలు మండలంలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చెంచులక్ష్మీపురంలోని ఈద్గా వద్ద ఇమాము సోయబ్ హక్తర్, ఇబ్రహీంపేట తిప్ప మధ్య ఉన్న ఈద్గా వద్ద ఇమాము అబ్దుల్‌వహీద్‌లు బక్రీద్ పండుక గురించి వివరించారు.

● **కందుకూరు :** కందుకూరు పట్టణం పరిసర గ్రామాల్లో ముస్లింలు బక్రీదు పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పెద్ద మసీదు, జామీయా మసీదు, సంతోష్ నగర్, విక్కిరాలపేట రోడ్డు, లుంబినీవనం ప్రాంతాల్లో ఉన్న ఈద్గాల్లో ముస్లింలు వేలాది మంది ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. బక్రీద్ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పాటు తమ ఇరుగుపొరుగువారికి తోఫాలు అందచేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.



అల్లూరు : మసీదులో నమాజు చేయిస్తున్న మత పెద్ద



కొండాపురం : సాయిపేటలో నమాజు చేస్తున్న ముస్లింలు



లింగసముద్రం : ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లింలు


షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

లింగసముద్రం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ఎంపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన 10వ తరగతి పరీక్షలలో కంచరగుంట మహాలక్ష్మి 586 మార్కులు, పతకమూరి సుష్మ 585 మార్కులు సాధించి ఈ అవార్డుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు శనివారం చెప్పారు. ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమంలో వీరిద్దరికి జిల్లా కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా రూ.20 వేల, మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తారని తెలిపారు. వీరిని హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు అభినం దించారు.

అన్నెబోయినపల్లి-అంగిరేకులపాడు రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్ల మంజూరు

లింగసముద్రం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అధ్వానంగా ఉన్న అన్నెబోయినపల్లి - అంగిరేకులపాడు పంచాయతీరాజ్ రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు అయ్యాయి. దీంతో అధికారులు టెండర్లు పిలిచారు. ఈ నెల 17వ తేదీ టెండర్లు వేసేందుకు ఆఖరు తేదీ అని 'ఏఈ ఏ హనుమంతరావు చెప్పారు. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలకు రోడ్డు కష్టాలు త్వరలో తీరనున్నాయి.

నిమ్మపండు ఛాయ.. ముఖాన బిగి నగవు.. భారతీయ విద్యాభవన్ ప్రాంగణంలో ప్రతి ఉదయం చురుగ్గా నడుస్తూ కనిపించే 80 ఏళ్ల పెద్దాయన పేరు మురళి. విద్యావేత్త. ఎస్వీ యూనివర్సిటీ పూర్వ వైస్‌ఛాన్సలర్. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకు మేనమామ. ఈ ఆర్భాటమేదీ ఆయన మాటల్లోనూ, ప్రవర్తనలోనూ కనిపించదు. రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో విశ్రాంత జీవితం గడుపుతున్నారాయన. విద్యారంగంలో అపార అనుభవం ఉన్న ప్రొఫెసర్ మురళితో ఆంధ్రజ్యోతి మార్నింగ్ వాక్ సంభాషణ..



ఎస్వీయూలో కామర్స్‌లో పీజీ పూర్తి చేసి 1969లో ఫ్యాకల్టీ మెంబర్‌గా జాయిన్ అయిన మురళి 1980లో 'ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ ఇన్ షుగర్ ఇండస్ట్రీ' అనే అంశంపై ప్రొఫెసర్ కృష్ణస్వామి నేతృత్వంలో పీహెచ్‌డీ చేశారు. ఎస్వీయూ కామర్స్ విభాగంలో తొలి డాక్టరేట్ పట్టా వీరిదే. తిరుపతిలో ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నారు.

అమ్మ మాటలే బాటగా...

"మా సొంతూరు కడప జిల్లా రాజంపేట. అక్కడే పుట్టి, పెరిగా. అప్పట్లో రాజంపేటలో హైస్కూల్ లేదు. ఊరి పెద్దల చొరవతో నా చిన్నపుడే రాజంపేటకు స్కూల్ మంజూరైంది. మా తాత తొలిచందా ఇచ్చి, ఇతర దాతల సహకారంతో బడి నిర్మాణం పూర్తి చేశారు. ఊళ్లోనే బడి ఉండడంతో నా చదువు ఆటంకం లేకుండా సాగింది. పీయూసీ కోసం 1961లో తిరుపతికి వచ్చి ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ (ప్రస్తుత ఓరియంటల్ కాలేజ్)లో చదువుకున్నా. మా అమ్మ నన్ను బాగా ప్రోత్సహించేది. 'చదువుకుంటేనే విలువ' అని పదేపదే చెప్పేది. అమ్మ మాటలే చదువుపై గురి పెంచాయి. ఉన్నత చదువులకు నడిపించాయి. మా అక్క ఆ రోజుల్లోనే ఎంఏ సంస్కృతం చేసింది. అప్పట్లో ఆడపిల్ల ఎంఏ అంటే అందరూ ఆశ్చర్యపోయేవారు.

నేను టీచర్...వెంకయ్య స్టూడెంట్

21 ఏళ్లకే కామర్స్‌లో పీజీ పూర్తిచేశా. 22ఏళ్ల వయస్సులోనే నెల్లూరు వీఆర్ కాలేజ్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పుడు ముప్పవరపు వెంకయ్య నాయుడు అక్కడ బీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. భారతీయ జన సంఘ్‌లో చురుగ్గా ఉండేవాడు. నా విద్యార్థి కాదుగానీ మా ఇద్దరి మధ్య ఒక బంధం ఉండేది. కలిసి మాట్లాడుకునేవాళ్లం. ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా తరుచూ మాట్లాడేవారు. ఇటీవల తిరుపతిలో జరిగిన జమిలి ఎన్నికల అవగాహన సదస్సులో కూడా మేమిద్దరం ఒకే వేదిక పంచుకున్నాం.

వర్సిటీలు డొల్లగా మారుతున్నాయి!

● ప్రభుత్వాలు పట్టించుకోవాలి ● ఎస్వీయూ మాజీ వీసీ ప్రొఫెసర్ మురళి



" సత్య నాదెళ్ల ప్రాథమిక విద్య వరకు మాకు దగ్గరగా ఉండేవాడు. చిన్నపుడు కూడా చాలా చురుకుగా ఉండేవాడు. ఇప్పటికీ అప్పుడప్పుడూ కుటుంబ విషయాల గురించి ఫోన్‌లో మాట్లాడుకుంటాం. ఒక్కోసారి సత్యా ఇండియాకు వచ్చే విషయం కూడా పత్రికల్లో చూసి తెలుసుకుంటూ ఉంటాం. అంత బిజీ."

వివాదాలన్నీ వీసీ ఛాంబర్ చుట్టూ

ప్రశ్నించేవారు లేకపోతే వ్యవస్థ పనిచేయదు. అలాగని విద్యాలయాల్లో విశృంఖలత్వం పనికిరాదు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాల ఆధిపత్యం కలవరపెడుతోంది. వామపక్ష పార్టీల విద్యార్థి సంఘాలు అప్పుడూ చురుకుగా ఉండేవి. వారి సిద్ధాంతాల ప్రకారం నడిచేవి. పాలనావ్యవహారం జోలికి వచ్చేవారు కాదు. వాళ్ల సమస్యలేమైనా ఉంటే ప్రిన్సిపల్ స్థాయిలో, హాస్టల్‌లో ఏదైనా ఉంటే వార్డన్ పరిధిలో జరిగిపోయేవి. ఇప్పుడన్నీ వీసీ ఛాంబర్ చుట్టూ జరుగుతున్నాయి. ఇది మంచి పరిణామం కాదు.

ఒకసారి ఏం జరిగిందంటే..

నేను వీసీగా ఉన్నప్పటి ఒక సందర్భం గురించి చెబుతాను.. ఒకరోజు రాత్రి హాస్టల్‌లో కరెంట్ లేదు. విద్యార్థులు ప్రిన్సిపల్‌నూ, వార్డన్‌నూ అడిగితే పై అధికారుల నిర్ణయమని తోసేశారు. ఆ అసహనంతో విద్యార్థులు వీసీ ఛాంబర్‌లోకి చొరబడి పూలకుండీలు పగలగొట్టారు. కుర్చీలు విరగొట్టారు. నిజానికి జరిగింది ఏమిటంటే..సెలవులు ఇచ్చినా హాస్టల్ ఖాళీ చేయడంలేదన్న కారణంతో కరెంట్ తీసేశారు. అది కూడా ప్రిన్సిపల్, వార్డన్ పరిధిలో జరిగిన నిర్ణయం. కానీ రాజకీయ ప్రోద్బలంతో విద్యార్థులను తప్పుదారి పట్టించారు. ఇటువంటి వాతావరణం విశ్వవిద్యాలయాలను కలుషితం చేస్తున్నాయి.

వీసీగా దిగిపోయినా పార్ట్‌టైం ఫ్యాకల్టీగా..

2001 నవంబరు 7 నుంచి 2004 నవంబరు 6 దాకా ఎస్వీయూ వీసీగా పనిచేశా. వీసీగా బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత మళ్లీ విభాగాధిపతిగా చేశా. వీసీగా చేసి మళ్లీ విభాగాధిపతిగా ఎందుకు.. రిజైన్ చేసెయ్యమని కొందరు సలహా ఇచ్చారు. నేను మాత్రం నా విభాగంలో పనిచేసి రిటైర్ అయ్యా. పదవీ విరమణ చేసిన తర్వాత కొంతకాలం పార్ట్‌టైం ఫ్యాకల్టీగా కూడా పనిచేశా. భారతీయ విద్యాభవన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నా. మా అబ్బాయి అమెరికాలో స్థిరపడ్డాడు. అక్కడికి రెండేళ్లకోసారి వెళ్లి వస్తుంటాం. రోజూ ఉదయం 5 గంటలకే లేచి వ్యాయామం చేయడం, మితాహారం.. ఇవే నా ఆరోగ్య రహస్యాలు.


వర్సిటీలకు నిధుల కొరత

ప్రస్తుతం విశ్వవిద్యాలయాలను నిధుల కొరత వేధిస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీలు తప్ప స్టేట్ యూనివర్సిటీలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో మన వర్సిటీలకు నిధులకు కొరత లేదు. విభజన తర్వాత నిధుల కష్టాలు మొదలయ్యాయి. దీన్ని అధిగమిస్తే తప్ప చదువులో నాణ్యత పెరగదు. ప్రభుత్వాలు పట్టించుకోవాలి. విశ్వవిద్యాలయాలు మంచి పౌరులను దేశానికి అందించగలవు. డొల్లగా మిగిలిపోతున్న యూనివర్శిటీలకు తిరిగి జవసత్వాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. అత్యంత ప్రాధాన్యాంశంగా దీనిని గుర్తించాలి.

ఆందోళనకర స్థితిలో ఎస్వీయూ

ఎస్వీయూకు క్రమంగా గ్రేడ్ తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ముఖ్యకారణం సిబ్బంది కొరత. కొన్ని విభాగాలైతే ఒకరిద్దరు ప్రొఫెసర్లతోనే నడుస్తున్నాయి. దీనివలన వర్సిటీ స్థాయి దిగజారిపోతుంది. నాణ్యమైన విద్య దూరమైపోతుండడంతో దూరవిద్య ద్వారా డిగ్రీలు తెచ్చుకుంటున్నారు. కంప్యూటర్ బేస్డ్ కోర్సులకు మాత్రమే విద్యార్థులు వర్సిటీలకు వెళుతున్నారు. పరిశోధనల సంఖ్య కనిపిస్తున్నా.. గైడ్‌ల కొరత ఉంది.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో 4వ స్థానం



● 13,238 మందికిగాను 7,770 మంది ఉత్తీర్ణత

● ఇందులోనూ బాలికలే ముందంజ

తిరుపతి(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు నాల్గవ స్థానంలో నిలిచారు. మే 12 నుంచి 20వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ పరీక్షలు జరిగాయి. ఇంటర్ విద్యామండలి శనివారం ఫలితాలను విడుదల చేసింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇరువురూ ఉత్తీర్ణతలో నాల్గవ స్థానంలో నిలించారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు 7,985 జనరల్ విద్యార్థులు హాజరుకాగా 4,068 మంది ఉత్తీర్ణులై 51 శాతం ఉత్తీర్ణను నమోదు చేశారు. 3,917 మంది పెయిల్ అయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 301 మంది పరీక్షలు రాయగా 160 మంది ఉత్తీర్ణులై 53 శాతం ఉత్తీర్ణత సాధించారు. 141 మంది పెయిల్ అయ్యారు. ప్రథమ సంవత్సరంలో 8,286 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,227 ఉత్తీర్ణులై 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. 4,059 మంది పెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,708 మంది హాజరుకాగా 3,360 మంది పాసై 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. 1,348 మంది విద్యార్థులు పెయిలయ్యారు. అలాగే 244 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయగా 183 మంది పాసై 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. 61 మంది పెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 4,952 విద్యార్థులు హాజరుకాగా 3,543 మంది ఉత్తీర్ణులై 59 శాతం ఉత్తీర్ణత సాధించారు.

బాలికలదే పైచేయి..: ఈ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లోనూ బాలికలు బాలురకంటే ఓ అడుగు ముందు నిలిచారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 8,037 మంది పరీక్షలకు హాజరుకాగా 4,671 మంది పాసై 58.12 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక బాలికల్లో 5,201 మంది పరీక్షలు రాయగా 3,099 మంది పాసై 59.58 శాతం ఉత్తీర్ణత పొంది తమ ఆదిపత్యాన్ని చాటుకున్నారని ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

కిలో రూ.12 లెక్కన నేటినుంచి తోతాపురి కొనుగోళ్లు



తిరుపతి (కలెక్టరేట్), జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): రాయలసీమ మామిడి రైతులకు సీఎం చంద్రబాబు తీపి కబురందించారు. తోతాపురి మామిడి కాయలను కిలో రూ.12 లెక్కన ఆదివారం నుంచే కొనుగోలు చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి రాజమౌళి శనివారం రాత్రి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్, శ్రీధర్‌లతో తోతాపురి మామిడి కొనుగోళ్లపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4.50లక్షల టన్నుల తోతాపురి దిగుబడి ఉంది. సీజన్ ప్రారంభమైనా అటు వ్యాపారులు కానీ, ఇటు మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం కానీ తోతాపురిని కొనుగోలు చేయకపోవడంతో మామిడి రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది.బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.4 కూడా పలక్కడంతో మామిడి రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆదివారం నుంచి తోతాపురి మామిడి క్రయవిక్రయాలు యుద్ధప్రాతిపదికన జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మామిడి గుజ్జు పరిశ్రమలు కిలో మామిడికి రూ.8 చెల్లించనుండగా, ప్రభుత్వం రూ.4 మేర సబ్సిడీ రూపేణా చెల్లించనుంది. ఇందువల్ల ప్రభుత్వంపై రూ.160కోట్ల దాకా భారం పడనుందని అంచనా. ప్రభుత్వం నుంచి రూ.4 అదనంగా వస్తుండటంతో నేటినుంచి మామిడిపల్ప్ యూనిట్లు కూడా రైతుల నుంచి కాయలు కొనుగోలు చేయనున్నాయి.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

● ప్రసన్న వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వడమాలపేట,జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.30 నుంచి 8.00 గంటల నడుమ మిథున లగ్నం లో వైఖానస ఆగమోక్తంగా కంకణ భట్టాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మాడవీధుల్లో తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి ధ్వజస్తంభం ఎగుర వేశారు. ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణం నిర్వహించారు.అనంతరం ఉభయనాంచారులతో శ్రీవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ అనంతరం పెద్ద శేషవాహనం పై దేవేరుల సమా శ్రీనివాసుడిని అధిరోహింప జేసి సంపుర్ణ అలంకరణతో మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణభట్టార్ తిపయ్యఆచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

వాహనాల బహూకరణ

తిరుపతికి చెందిన మాధవరావు రూ.6.50 లక్షలతో సూర్య, చంద్రప్రభ వాహనాలను, రైల్వే కోడూరుకు చెందిన మురళి రూ.5 లక్షలతో గజవాహనాలను అధికారులకు అందజేశారు. దాతలకు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయా వాహన సేవ రోజుల్లో దాతలకు ప్రాతినిథ్యం కల్పిస్తున్నట్లు అధికారులు చెప్పారు.




పెద్దశేష వాహనంపై దేవేరులతో శ్రీవారు

ప్రాణం తీసిన ఈత సరదా

● ఇద్దరు చిన్నారుల మృతి
● తల్లి చూస్తుండగానే మృత్యు ఒడిలోకి కుమార్తె

పెళ్లకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణం తీసింది. మండలంలోని కలవకూరు సమీపంలో స్వర్ణముఖి నది డ్యామ్ వద్ద శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శ్రీకాళహస్తి బహుదూర్‌పేట ముత్తరాశి కాలనీకి చెందిన బచ్చల జ్యోతి, ఆమె తల్లి లక్ష్మి, తమ్ముడు కుమార్, కుమార్తె నందిని (9)తోపాటు బహుదూరుపేట, సాలిపేటకు చెందిన మరో ఐదుగురు పిల్లలను తీసుకుని ఆటోలో కలవకూరు సమీపంలోని కాజ్‌వే వద్దకు చేరుకున్నారు. కలవకూరులో జ్యోతికి సమీప బంధువులు ఉండటంతో తరచూ వస్తూపోతూ ఉంటారు. శనివారం కూడా బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో నదిలోని నీటిగుంటలో ఆరుగురు పిల్లలు సరదాగా ఈత కొడుతూ గడిపారు. కొంతసేపటికి జ్యోతి కుమార్తె నందిని, మరో చిన్నారి లికిత్ (14) నీటిలో మునిగిపోతూ కేకలు వేశారు. మిగిలిన నలుగురు పిల్లలు ఒడ్డుకు చేరుకుని కేకలు వేయడంతో కొంత దూరంలో ఉన్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని నీటి గుంటలో గాలించారు. ఇద్దకు చిన్నారులను వెలికితీసి వారు వచ్చిన ఆటోలోనే శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కన్న కుమార్తె కళ్లెదుటే నీట మునిగి మృతి చెందటంతో తల్లి జ్యోతి కన్నీరుమున్నీరుగా విలపించింది. పెళ్లకూరు ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో శ్రీకాళహస్తికి వెళ్లి వివరాలు సేకరించారు.





మృతి చెందిన నందిని, లికిత్

భక్తిశ్రద్ధలతో బక్రీద్



తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హాజీలు మాట్లాడుతూ తోటివారిని ప్రేమించాలన్నారు. ఖురాన్‌ను ప్రతి ఒక్కరూ పఠించడం ద్వారా సన్మార్గంలో నడవగలుగుతారని, తద్వారా అల్లా ఆశీస్సులు పొందగలుగుతారని పేర్కొన్నారు. బక్రీద్‌ను త్యాగానికి ప్రతీకని గుర్తెరిగి పరస్పరం సాయం అందించుకోవాలన్నారు.

తిరుపతి యూనివర్సిటీ రోడ్డులోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హనుమంత, గజ వాహనాలపై గోవిందుడు

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు శనివారం ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై గోవిందుడు తిరుమాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కరుణించారు. ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 3గంటలకు వసంతోత్సవం తర్వాత బంగారు తిరుచ్చిపై స్వామివారు మాడవీధుల్లో ఊరేగారు. వాహనం ముందు గో, గోజ, అశ్వాలు వరుసక్రమంలో నడుస్తూ స్వామిపై భక్తిప్రపత్తులను చాటుకున్నాయి. కళాబృందాల ప్రదర్శనలు రంజింపచేశాయి. శనివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

స్వామి పిలుపుతోనే తిరుమలకు రాగలం

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): 'మనం అనుకున్నా.. స్వామి పిలిస్తేనే తిరుమలకు రాగలం' అని సినీ నటుడు రాజీవ్ కనకాల అన్నారు. తిరుమల శ్రీవారిని తన సహచరి సుమతో కలిసి శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'స్వామిని దర్శించుకున్న తర్వాత ఎంతో ఆనందంగా ఉంటుంది. అదొక అనిర్వచనీయ అనుభూతి' అని చెప్పారు. సుమ, రాజీవ్‌లతో పలువురు సెల్ఫీలు తీసుకున్నారు. కాగా ఎంపీ బీకే పార్థసారథి, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



సుమ, రాజీవ్ కనకాల

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో బాటగంగమ్మ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,174

తలనీలాలు సమర్పించినవారు: 35,132





ఏపీ పీజీ సెట్‌కు సర్వం సిద్ధం

- 9, 10, 11, 12 తేదీల్లో పరీక్షలు
- ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష షెడ్యూల్ మార్పు ● 17 వర్సిటీల్లోని 25వేల సీట్ల భర్తీ

ఏపీ పీజీసెట్ వివరాలు వెల్లడిస్తున్న సెట్ ఛైర్మన్ సీహెచ్ అప్పారావు, కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ - 2025 నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు పీజీసెట్ ఛైర్మన్, ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు చెప్పారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ సురేంద్ర బాబు తదితరులతో కలిసి శనివారం వీసీ ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ విద్యామండలి ఆధ్వర్యంలో పీజీసెట్‌ను ఎస్వీయూ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు సెట్ కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు పూర్తి చేశారని పేర్కొన్నారు.

మూడు షిఫ్టుల్లో 30 కేంద్రాల్లో..

జూన్ 9, 10, 11, 12 తేదీల్లో రోజూ మూడు షిఫ్టులుగా పీజీ సెట్ జరగనుంది. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడవ సెషన్ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు జరుగనున్నాయి. మొదటి రోజున 17 సబ్జెక్టులకు, రెండో రోజు 7 సబ్జెక్టులకు, మూడవ రోజున 5 సబ్జెక్టులకు, నాల్గవ రోజున 2 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ తోపాటు మన రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం 30 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి.

మేలైన మార్పులు

విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది పీజీ సెట్‌లో కొన్ని మార్పులు చేశారు. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, టూరిజం, లైఫ్ సైన్సెస్ సబ్జెక్టులను కలిపి ఒకే పరీక్షగా నిర్వహించనున్నారు. ఫలితంగా విద్యార్థులు ఒక్క పరీక్షతో ఏడు సబ్జెక్టుల్లో సీట్లు పొందే అవకాశం ఏర్పడింది. ఇలా ఇప్పుడు మొత్తం 31 సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగనున్నాయి.

తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో..

పీజీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులు డిగ్రీలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్య అభ్యసించి ఉంటారు. అందువల్ల రెండు మాధ్యమాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రశ్న పత్రాన్ని ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో సిద్ధం చేశారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషా సంబంధిత సబ్జెక్టులు మాత్రమే ఆయా మాధ్యమాల్లో ఉంటాయి.

తగ్గిన 6 వేల అప్లికేషన్లు

ఏపీలో మొత్తం 17 విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న 143 ప్రోగ్రామ్స్‌కు సంబంధించి సుమారు 25 వేల పీజీ సీట్లు ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకుగాను మొత్తం 25,688 మంది విద్యార్థులు ఏపీ పీజీసెట్-2025కు హాజరుకానున్నారు. అయితే గత ఏడాదితో పోల్చితే సెట్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈ దఫా సుమారు 6 వేల మంది తక్కువగా సెట్‌కు హాజరుకానున్నారు.

25వ తేదీలోపు ఫలితాలు

పీజీసెట్ ఫలితాలను ఈనెల 25వ తేదీలోపు ప్రకటిస్తామని ఛైర్మన్ చెప్పారు. ఫలితాలు విడుదల అయిన వెంటనే ప్రవేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గతంలో లాగానే ఈసారి కూడా కెమికల్ సైన్స్, లైఫ్‌సైన్స్, కంప్యూటర్‌సైన్స్, బోటనీ, జువాలజీ, మేథమేటిక్స్ వంటి సైన్స్ సబ్జెక్టుల్లో పోటీ ఎక్కువగా ఉందని, ఇంగ్లిష్, తెలుగు, హిస్టరీ, కామర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ వంటి సబ్జెక్టుల్లో ఒకమాదిరి పోటీ ఉందని వెల్లడించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయం మార్పు

ఏపీ పీజీ సెట్ షెడ్యూల్‌ను మార్చి 31వ తేదీన వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఐతే ఇటీవల ప్రకటించిన డీఎస్సీ షెడ్యూల్ కారణంగా పీజీసెట్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయంలో మార్పు చోటుచేసుకుంది. 9వ తేదీన పీజీసెట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షతోపాటు డీఎస్సీ పరీక్ష కూడా ఉండటంతో రెండింటికీ హాజరుకానున్న అభ్యర్థులు వర్సిటీ అధికారులకు విన్నపాలు పంపారు. ఆ మేరకు జూన్ 9వ తేదీ ఉదయం నిర్వహించతలపెట్టిన ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షను 10వ తేదీ మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించనున్నారు. ఇదితప్ప పీజీసెట్ షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులూ లేవని సెట్ ఛైర్మన్ వెల్లడించారు.

సూళ్లూరుపేట కమిషనర్‌పై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యపై శుక్రవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహేశ్వర్ కేసు నమోదు చేశారు. చిన్నయ్య తండ్రి ఉద్యోగంలో ఉండగానే.. ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి పదోన్నతులు కూడా పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో విచారణ ప్రారంభిస్తామన్నారు.

పుష్కరిణిలో సబ్బులు, షాంపుల బంద్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణిలో పరిశుభ్రతను పరిరక్షించేందుకు టీటీడీ ప్రత్యేక సిబ్బందిని నియమించింది. అత్యంత పవిత్రమైన, పరిశుభ్రమైన శ్రీవారి పుష్కరిణిలో ఇటీవల పరిశుభ్రత లోపించిందని భక్తుల నుంచి టీటీడీకి వరుసగా ఫిర్యాదులు అందాయి. 'పరిశుభ్రతకు నీళ్లొదులుతున్నారు' శీర్షికన ఆంధ్రజ్యోతి ఇటీవల కథనం ప్రచురించింది. ఈక్రమంలో ఉన్నతాధికారులు శ్రీవారి పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా నలుగురు సిబ్బందిని నియమించారు. భక్తులు దుస్తులు ఉతకకుండా, సబ్బులు, షాంపులు వినియోగించకుండా వీరు పర్యవేక్షిస్తారు.



పుష్కరిణి వద్ద విధుల్లో సిబ్బంది

పెద్ద ప్రమాదం..భక్తులు క్షేమం



చెట్టును ఢీకొన్న కారు

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైన సందర్భంలో 19వ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో నలుగురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

శ్రీవారి లడ్డూ జీఐ హక్కుల ఉల్లంఘనపై సీరియస్

- పలు సంస్థలకు టీటీడీ నోటీసులు

తిరుమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన శ్రీవారి లడ్డూప్రసాదం పేరును అనధికారికంగా వినియోగించుకుంటున్న కొన్ని సంస్థలపై టీటీడీ కొరడా ఝుళిపించింది. జీఐ(జియోగ్రాఫికల్ ఇండికేషన్) హక్కులను ఉల్లంఘిస్తూ స్వామి లడ్డూ పేరుతో తమ ఉత్పత్తులను విక్రయిస్తున్న, ప్రచారం చేస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలకు పూనుకుంది. ఇప్పటికే కొన్ని సంస్థలకు గత నెల 31న నోటీసులు జారీ చేసింది. 2009లోనే తిరుమల శ్రీవారి లడ్డూకు జీఐ పేటెంట్ లభించిన సంగతి తెలిసిందే. అంతకుముందు పదేళ్ల క్రితం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ చట్టం ప్రకారం జీఐ హక్కులను సాధించింది. పేటెంట్ హక్కులు, జీఐ పొందిన ఏకైక దేవాలయ ప్రసాదంగా శ్రీవారి లడ్డూ అగ్రస్థానంలో నిలిచింది. ఆన్‌లైన్ ద్వారా, నేరుగా కొన్ని స్వీట్స్ విక్రయ సంస్థలు శ్రీవారి లడ్డూ పేరుతో విక్రయిస్తున్నట్లు టీటీడీ గుర్తించింది. ఈ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు టీటీడీ లా విభాగం అధికారులు ఢిల్లీకి చెందిన సహదేవ లా చాంబర్స్ ద్వారా పుష్ మై కార్ట్, ట్రాన్సాక్ట్ ఫుడ్స్ లిమిటెడ్, ఇండియా స్వీట్ హౌస్ వంటి ఐదారు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. బయట విక్రయాలతో ఈ ప్రసాదానికి ఉన్న గౌరవాన్ని తగ్గిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఇప్పటికే పుష్ మై కార్ట్ తమ ఉత్పత్తుల జాబితా నుంచి లడ్డూ ప్రసాదం పేరును తొలగిస్తున్నట్టు ప్రకటించింది. మరికొన్ని కూడా తొలగించినట్టు తెలిసింది.

లడ్డూ ప్రసాదం స్వీట్ కాదు : ఈవో

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం. స్వీట్ కాదు. ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ఇది ప్రతీక టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. ఇలాంటి ప్రసాదం పేరును బయట సంస్థలు తప్పుగా వాడితే చర్యలకు వెనకడుగు వేయబోమన్నారు.

భక్తులకు శుభవార్త

- తిరుపతి టూ పూరి ఆర్టీసీ బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంతో పాటు ఒడిశా ప్రజలకు ఇది నిజంగా శుభవార్తే. పూరి జగన్నాథ స్వామి, తిరుమల శ్రీవారి ఆలయాలను సందర్శించాలనుకునే వారికోసం పూరి టూ తిరుపతికి ఒడిశా ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. తిరుపతి, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, బెర్హంపూర్ మీదుగా పూరి(భువనేశ్వర్)కి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇదే మార్గంలో నడుస్తాయి. ఇలా రెండు ప్రభుత్వాలు పరస్పర రహదారి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఏసీ స్లీపర్ 42 సీట్ల సామర్థ్యం, తాజా సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సదుపాయాలు, ఆకర్షణీయమైన రంగులతో తిరుపతి బస్టాండులో బస్సు సిద్ధంగా ఉంది. పురుషులకు రూ.2,750,స్త్రీలకు 50శాతంతో రూ.1,375గా టిక్కెట్ నిర్ణయించారు. ఈ విధానం ఉభయ రాష్ట్రాల ప్రజలకూ వర్తిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్సు బుకింగ్ చేసుకోవచ్చు.

బస్సు ప్రయాణించే రోజులు, వేళలిలా...

● ప్రతి శని, సోమవారాలు ఉదయం 9గంటలకు తిరుపతి బస్టాండు నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు పూరికి చేరుకుంటాయి. ● ప్రతి బుధ, శుక్రవారాలు ఉదయం 9 గంటలకు పూరి నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10గంటలకు తిరుపతికి చేరుకుంటాయి.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ - ఓపెన్ హౌస్ ఈవెంట్‌కు హాజరైన విద్యార్థులు





ఐఐటీలో ఓపెన్ హౌస్ ఈవెంట్

- ప్రత్యక్షంగా 60.. ఆన్‌లైన్‌లో 120మంది హాజరు

ఏర్పేడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ ఈవెంట్ జరిగింది. ఈ అవగాహన సదస్సులో 60మంది విద్యార్థులు ప్రత్యక్షంగా, 120మంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. పరిశోధనలు, కన్సల్టెన్సీ, పరిశోధనలు-పరిశ్రమల సహకారానికి అవకాశాలు, కెరీర్ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్ అవకాశాలపై ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా జీవితంపై స్పష్టతను అందించడం ద్వారా విద్యార్థులు కెరీర్ అభివృద్ధిపై దృష్టి సారించడానికి అవకాశం ఉంటుందని ఈ ఓపెన్ హౌస్ ద్వారా వివరించారు.

కారు డెకార్స్ యజమానిపై వైసీపీ శ్రేణుల దాడి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు డెకార్స్ యజమానిపై వైసీపీకి చెందిన ముగ్గురు యువకులు దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటన శనివారం తిరుపతి చింతలచేను వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మోహన్‌రావు చింతలచేను రోడ్డులో సీఎస్ఆర్‌కే పేరుతో కారు డెకార్స్ కంపెనీ నడుపుతున్నాడు. తిమ్మినాయుడుపాలెంకు చెందిన వైసీపీ నేత చైతన్యయాదవ్ భాగస్వామిగా ఉన్నాడు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. వివాదం ముదరడంతో కంపెనీ షోరూములో ఉన్న మోహన్‌రావుపై చైతన్య యాదవ్, అతని వర్గీయులు మూకుమ్మడిగా దాడి చేశారు. మోహన్‌రావుకు గాయాలయ్యాయి. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లింగేశ్వరనగర్‌లో ఫ్లెక్సీల రగడ

- వైసీపీ సర్పంచ్ అత్యుత్సాహంతో ఫ్లెక్సీలు, టెంట్ల ఏర్పాటు
- టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వనగర్‌లో సర్పంచ్ అత్యుత్సాహంతో చేసిన ఏర్పాట్లు ఉద్రిక్తతకు దారితీశాయి. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదానికి కారణమైంది. పోలీసుల కథనం మేరకు...లింగేశ్వర నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు(వైసీపీ) పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం గ్రామంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. షామియానా, టెంట్లతో పాటు రోడ్డుకు అడ్డంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టారు. దాదాపు 10 ఇళ్ల చుట్టూ టెంట్లు వేసి రాకపోకలకు దారి లేకుండా చేయడంతో సర్పంచ్ ఇంటి పక్కనే ఉంటున్న హేమలత(టీడీపీ) నిరసించారు. ప్రజలకు అసౌకర్యం కల్గించారంటూ ప్రశ్నించారు. ఈ దశలో ఇరు పక్షాల మధ్య వాదోపవాదోలు తీవ్రస్థాయికి చేరాయి. ఆగ్రహోదగ్రులైన టీడీపీకి చెందిన కొందరు బ్యానర్లు, ఫ్లెక్సీలను చించేశారు. దీంతో వైసీపీ నాయకులు, సర్పంచ్ వర్గీయులు హేమలతతో పాటు అతని కుమారుడుపై చిట్టిరాయులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీసులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సీఐ చిన్నగోవిందు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఆ సమయంలో వైసీపీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ డౌన్...డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే సీఐ చిన్నగోవిందు టీడీపీ కార్యకర్తలాగా వ్యవహరించి బ్యానర్లు, ఫ్లెక్సీలు చించి వేశారంటూ వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆయన అనుచరులు విమర్శించారు. స్టేషనుకు వచ్చి సీఐ వ్యవహార శైలిపై డీఎస్పీ ప్రసాద్‌కు పిర్యాదు చేశారు. ఘటనపై విచారించి నివేదిక ఇవ్వాలని సీఐ సునీల్‌కుమార్‌ను డీఎస్పీ ఆదేశించారు.

వేడుకగా తెప్పోత్సవాలు ప్రారంభం

- 10న పద్మావతి అమ్మవారికి గజ వాహన సేవ

తిరుచానూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి పద్మసరోవరంలో విహరించి భక్తులను అభయమిచ్చారు. ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించాక మధ్యాహ్నం కేటీ మండపంలో శ్రీకృష్ణస్వామికి అభిషేకం జరిగింది. సాయంత్రం ఉత్సవ మూర్తులను పుష్కరిణిలోకి వేంచేసి తెప్పలపై కొలువుదీర్చారు. రాత్రి 7.15గంటలకు వేడుకగా తెప్పోత్సవం ప్రారంభమైంది. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఉభయదేవేరుల సమేత శ్రీకృష్ణసమేత మూడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించారు. అనంతరం తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి తెప్పలపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు అమ్మవారు తెప్పలపై భక్తులకు దర్శనభాగ్యం ఇవ్వనున్నారు. 10న అమ్మవారికి గజ వాహన సేవ, 11న గరుడ వాహన సేవ జరగనుంది. తెప్పోత్సవాల కారణంగా ఆర్జిత సేవలను రద్దు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇన్‌ఛార్జి ఏఈఎస్వో శైలేంద్ర బాబు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో తెప్పపై ఉభయదేవేరిలతో విహరిస్తున్న శ్రీకృష్ణస్వామి

అత్యాధునికంగా అలిపిరి చెక్‌పాయింట్

- అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు



తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్‌ను అత్యాధునిక తనిఖీ కేంద్రంగా తీర్చిదిద్దేలా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. భక్తులు ఎక్కువ సమయం వేచిఉండకుండా వాహనాల తనిఖీ, భక్తుల లగేజి స్కానింగ్ జరిగేలా అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులలో ఉన్న స్కానింగ్ వ్యవస్థను పరిశీలించాలని సూచించారు. టోల్‌ప్లాజాలో తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదక తయారు చేయాలన్నారు. సమీక్ష అనంతరం అలిపిరి చెక్‌పాయింట్‌లో స్కానర్లను పరిశీలించి అధికారులు, సిబ్బందితో ఈవో మాట్లాడారు.

భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల కేంద్రం తనిఖీ

ఇలాఉండగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళికృష్ణ, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులతో కలిసి భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల జారీని శనివారం సాయంత్రం ఈవో శ్యామలరావు పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. శ్రీవారిమెట్టుమార్గం ద్వారా వెళ్లే కాలినడక భక్తులకు రోజుకు సరాసరి 5 వేల టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. శ్రీవారిమెట్టుకు సమీపంలోని శ్రీనివాసమంగాపురంలో డీడీ టోకెన్ల జారీకి ఆర్కియాలజీ నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.

కల్తీ నెయ్యి కేసులో ధర్మారెడ్డిని విచారించాలి

- జనసేన నేత కిరణ్‌రాయల్



తిరుపతి(జీవకోన), జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలకపాత్రధారి అయిన మాజీ ఇన్‌చార్జి ఈవో ధర్మారెడ్డిని అరెస్టు చేసి విచారించాలని జనసేన నేత కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంవత్సర కాలంగా ఆయన ఎక్కడ ఉన్నారో తెలియదని, వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లడ్డూలో కల్తీ పెద్ద పాపమని, డబ్బు కోసం ఇది జరగలేదని, ఒక మతంపై దాడికోసమే చేశారని ఆరోపించారు.భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారికి శిక్ష సరిపోదని... ఉరి తీయాలన్నారు. నెయ్యి లేకుండా నాలుగేళ్ల పాటు లడ్డూలు అమ్మారని, ఈ విషయంలో ఒకరిద్దరు మీడియా సిబ్బంది కూడా సహకరించారన్నారు.టీటీడీలోని అన్ని విభాగాలకూ కీలకంగా వ్యవహరించిన ధర్మారెడ్డిని ఎవరు కాపాడుతున్నారనేది తేలాలన్నారు.అప్పటి పాలకమండలి సభ్యులకు కూడా ఇందులో భాగముందని వ్యాఖ్యానించారు.ఈ దొంగల ముఠాలో ప్రిన్సిపాల్ ఎవరంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ధర్మారెడ్డికి తెలియకుండా ట్యాంకులు పైకి ఎలా వెళతాయని ప్రశ్నించారు.కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా తప్పు చేసిన వారినే శిక్షించాలన్నారు. పర్చేజింగ్ కమిటీ మెంబర్లను కూడా విచారించాలన్నారు. ఈ అంశంపై చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

ట్రంప్ విధానాలపై వ్యతిరేకత

- ఆందోళనలో అమెరికాలోని భారతీయులు ● ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ చలం

తిరుపతి, జూన్7(ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధానాలతో ఇండియాతో పాటు పలు దేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ.చలం అన్నారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో 'ట్రంప్ విధానాలు భారతదేశంలో ప్రభావం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు పెంచడంతో ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఉత్పత్తిరంగం దెబ్బతిని నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఆయుధ వ్యాపారిగా మారిందని విమర్శించారు. అయినా ప్రధాని మోదీ ట్రంప్‌కు దాసోహం అంటున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు కార్యకర్తలు ట్రంప్ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 'కాశ్మీర్ సమస్య-బీజేపీ వైఖరి' అనే అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఇటీవల పెహల్గం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలను మోదీ రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలే కానీ అది యుద్ధంతో కాదని పేర్కొన్నారు. యుద్ధంతో సాధారణ పౌరులు చనిపోతారని అందుకే యుద్ధాన్ని వ్యతిరేకించామని వివరించారు. దీనిని బీజేపీ రాజకీయం చేసి సీపీఐపై అభాండాలు మోపిందన్నారు. అయితే ట్రంప్ యుద్ధాన్ని ఆపాలని చెప్పగానే ఆపివేశారని తెలియజేశారు. టెర్రరిస్టుల, మావోయిస్టుల అంతం కొనసాగుతుందని చెప్పడం కేవలం బీహార్‌లో ఎన్నికల లబ్ధి కోసమేనని విమర్శించారు. ఈ సదస్సుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షత వహించగా నగర కార్యదర్శి విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు.





మాట్లాడుతున్న చలం, నారాయణ

భానుడి భగభగ..

నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలు

జూన్ ఆరంభంలోనూ వేడెక్కిన వాతావరణం



షార్ బస్టాండు వద్ద నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

సూళ్లూరుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గడిచిన వారం రోజుల నుంచి ఎండలు రోహిణి కార్తెను గుర్తు చేస్తున్నాయి. సూర్యోదయం నుంచే భానుడు భగభగ మంటున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతతో ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. మే నెలలో రుతుపవనాలు ప్రవేశించడంతో కురిసిన వర్షాలకు చల్లబడిన వాతావరణం జూన్ మొదటి వారంలో ఒక్కసారిగా వేడెక్కింది. సూళ్లూరుపేటలో శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజుల నుంచి భానుడు భగభగ మంటుండడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి. రాత్రివేళల్లో కూడా ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది ముందుగానే తొలకరి వానలు పలకరించాయి. అయితే అనూహ్యంగా మళ్లీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతకు తోడు వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం 12 గంటలకే పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. రాత్రి సమయాల్లో కూడా వేడిగాలులు తగ్గడం లేదు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆశాఖ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. శనివారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు లో, హైవోల్టేజీ సమస్యలు తలెత్తకుండా మెరుగైన విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బిల్లుల బకాయిలను సకాలంలో వసూళ్లు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించి సోలార్ ప్యానెల్స్ అమర్చుకునేలా వినియోగదారులను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ నరేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, ఏఈలు ఏడుకొండలు, చిన్నయ్య, నరసింహారెడ్డి, భాస్కర్, విజయకృష్ణ, ఎల్ఐ శీనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



మృతి చెందిన మణి

నాయుడుపేట టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - నరసారెడ్డి కండ్రిగ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి మణి (25) అనే యువకుడు మృతి చెందాడు. చిట్టమూరు మండలం గునపాడు గ్రామానికి చెందిన మణి పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేసేవాడు. శనివారం సాయంత్రం దుకాణంలో పనులు ముగించుకొని మోటారు సైకిల్‌పై స్వగ్రామమైన గునపాడుకు బయలుదేరాడు. నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో వెళ్తుండగా మోటారు సైకిల్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మణి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ మాలకొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, రైల్లో నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉండవచ్చన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరి పారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు.

అభివృద్ధి పనులకు రూ.3.71 కోట్లు మంజూరు

గూడూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3.71 కోట్లు నిధులను మంజూరు చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ శనివారం పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన పథకం ద్వారా పంచాయతీల్లో వాటర్‌ప్లాంట్లు, అంగన్‌వాడీ పాఠశాలల్లో మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల అభివృద్ధికి, రూరల్ వాటర్ సప్లయ్ పథకం ద్వారా పంచాయతీల్లో బోర్లు వేసేందుకు, పట్టణంలోని కోర్టులో మరుగుదొడ్ల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు ఈ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

వేలాడుతున్న మృత్యుపాశాలు

ఆవాసాలపై 11 కేవీ విద్యుత్ తీగలు ● భయం గుప్పిట్లో మూడు గ్రామాల ప్రజలు



చిల్లకూరులో ఇళ్లపై వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు

పెళ్లకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు నుంచి నెలబల్లి వరకు ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉంది. 71 జాతీయ రహదారి పక్కన ఉన్న తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు గ్రామాల్లో నివాస గృహాలపైనే విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. ఇళ్ల పైకప్పు పైన మనుషులకు తగిలే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో భయం గుప్పిట్లో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇళ్ల వద్ద కొబ్బరి, మామిడి, వేప చెట్లకు విద్యుత్ తీగలు తగులుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ట్రాన్స్‌కో ఏఈ సురేష్‌బాబు స్పందిస్తూ దిగువచావాలి, తాళ్వాయిపాడు, చిల్లకూరు గ్రామాల్లో ఇళ్లను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.



గూడూరులో నమాజ్‌కట్ట వద్ద, నాయుడుపేటలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్ అని ముస్లిం మతపెద్దలు అన్నారు. శనివారం బక్రీద్ సందర్భంగా పట్టణంలోని నమాజ్ కట్ట, జామియా మసీదు, దర్గాలు, మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ లోని బోధనలను వినిపించారు. అలాగే మండలంలోని చెన్నూరు, విందూరు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ నియోజకవర్గంలోని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చిల్లకూరు: మండలంలోని చిల్లకూరు, పారిచెర్లవారిపాళెం, తొణుమాల, ఉడతావారిపాళెం, ఏరూరు, మోమిడి తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఓజిలి: మండలంలోని ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఓజిలితో పాటు కురుగొండ, రాచపాళెం, ఆరిమేనిపాడు, కార్శిమేడు, అత్తివరం, కరబల్లవోలు తదితర గ్రామాల్లోని మసఅదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తడ: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పూడికుప్పం వద్ద ఉన్న మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం నాయకులు హుస్సేన్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండలంలో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మన్నారుపోలూరులో ఈద్ నమాజు చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంతో పాటు మండలంలోని మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు, నూర్‌మసీద్, మక్కా మసీదు, అమీర్‌షావలి మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని జామీయ మసీదు, బొమ్మిడి కాలువలోని అక్ష మసీదు, మాసాపేటలోని ఉమ్మర్ మసీదు, తూర్పువీధిలోని రెహ్మానీయ మసీదు, ఒంటెలవీధిలోని బిలాన్ మసీదు, ప్యాలెస్ సెంటర్‌లో హిమాం మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు.

కోట: మండలంలోని కోట, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం, పుచ్చలపల్లి మసీదుల్లో ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు చేశారు. శ్యామసుందరపురంలోని జామియా మసీదులో ఇమాంలు ఖురాన్ విశిష్టతను వివరించారు. రవినగర్‌లో గ్రీన్ ఫౌండేషన్ ప్రతినిధి షేక్ జలీల్ అహ్మద్ పేద ముస్లిం కుటుంబాలకు మాంసం పంపిణీ చేశారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రకృతికుమార్

వెంకటగిరి టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెగుంలో గిరిజన కుటుంబాలకు స్వామి వివేకానంద యువ సైన్యం వ్యవస్థాపకుడు, ఏపీపీ ప్రకృతికుమార్ శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగవాన్ సురేష్ మహారాజ్, స్వామి వివేకానందా యువసైన్యం సభ్యులు గోపీనాథ్, రాంప్రసాద్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు



గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా వీధిలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేనారాధనం, పుణ్యాహవచనం, నిత్య హోమం పూజలు జరిపి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ పాల్గొన్నారు.

విద్యానగర్‌లో ఇంటర్వ్యూలు



నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ కొత్తపాళెం రోడ్డులో ఉన్న శ్రీనివాస రైసు మిల్లులో శనివారం ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. అన్‌డిన్‌సోడగల్ సంస్థ ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన ఐమేక్యూ సొల్యూషన్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఆ కంపెనీ హెచ్‌ఆర్‌లు పూజ, సాయికుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 30 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి భూపతి మోహన్‌సాయి, సురేంద్రరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బాలసుబ్రహ్మణ్యం, పోలయ్య, మల్లికార్జున్, హేమంత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్)జూన్7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కందారపు మురళి, ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతి సీఐటీయూ కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేటర్లకు అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ సమ్మె చేపట్టనున్నాయని వివరించారు. ఆ లేబర్ కోడ్‌లను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకుంటోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసే ప్రయత్నాలను అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయివరకు ప్రచారం చేస్తామని చెప్పారు.

24న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

వెంకటగిరి టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతులకు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు. విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25న ఫలితాలు ప్రకటించి, 26న అడ్మిషన్లు ఇస్తామన్నారు.

జనసేన బలోపేతానికి కృషి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కాండ్ర గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అధిష్టానం గుర్తింపునిస్తుందన్నారు. పవన్‌కల్యాణ్ ఆశయాలను గ్రామస్థాయిలోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జగదీష్, నవీన్‌రాజు, దిలీప్, కిరణ్, మోహన్, కృష్ణ, చరణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కోటంబేడులో సంకల్ప అభియాన్



కోటంబేడులో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయశ్రీ

బాలయపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంబేడు పంచాయతీ పరిధిలో గల పలు గ్రామాల్లో శనివారం వెంకటగిరి మండలం పెరియవరం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వికసిక కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త విజయశ్రీ మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు సంబంధించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సమతుల ఎరువుల వాడకం, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం, సాగు ఖర్చు తగ్గించి సుస్థిర ఆదాయం పొందడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్ వినోద్, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం

గూడూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయంలో శనివారం ఎస్‌బీఐ స్టాఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీగా పనిచేసిన తారకనాథ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, మూర్తి, బాబురావు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ నోరు తెరవని కాకాణి

● నేటితో ముగియనున్న పోలీసు కస్టడీ

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీలో రెండవరోజు శనివారం కూడా నోరుమెదపలేదని తెలిసింది. పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో ఏ4గా రిమాండ్‌లో ఉన్న కాకాణిని జిల్లా కేంద్రకారాగారం నుంచి పోలీసు కస్టడీకు తీసుకున్న విషయం తెలిసిందే. కృష్ణపట్నం పోలీసు స్టేషన్‌లో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మధాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారణ సాగింది. పోలీసులు ఏ ప్రశ్న అడిగినా కాకాణి నాకు తెలియదు, గుర్తులేదు... అన్న సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ఆదివారం నాటితో కాకాణి పోలీసు కస్టడీ ముగియనుంది.

● రుస్తుం మైన్స్ కేసులో ముగ్గురికి బెయిల్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన రుస్తుం మైన్స్ అక్రమాల కేసులో నిందితులుగా రిమాండ్‌లో ఉన్న వారిలో హైకోర్టు ముగ్గురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు ముందస్తు బెయిలు తీసుకోగా, ఏ4గా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నారు. ఏ6గా ఉన్న వేమిరెడ్డి అరవింద్ కుమార్‌రెడ్డి నాలుగురోజుల క్రితం విడుదల కాగా, ఏ7 కరుణాకర్‌రెడ్డి, ఏ8 శివారెడ్డికి హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు శనివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.



ఎంఈవో రవూఫ్‌కు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

క్రీడలను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే సహకారం

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారం అందిస్తున్నారని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని పలు పాఠశాలలకు ఎమ్మెల్యే దాతృత్వంతో క్రీడా పరికారాలను ఎంఈవో రవూఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే తన సొంతనిధుల ద్వారా క్రీడా పరికరాలను 15 పాఠశాలలకు అందజేశారన్నారు. అదేవిధంగా స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నూతనంగా గ్యాలరీ, ఓపెన్ జిమ్, ప్రహరీ నిర్మాణాలకు ఎమ్మెల్యే సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో సుమన్, లవకుమార్, శర్మ, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటరమణ, బృంద, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించండి



ఎంఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకుల నిరసన

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో ఉపాధ్యాయ సంఘాలు నేతలు విద్యాశాఖ అధికారులతో జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం వెబ్ ఆప్షన్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించడం సరికాదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని, లేకుంటే డీఈవో కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో రవిచంద్ర, మురళీసింగ్, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ వద్దు

దక్కిలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు వెబ్ కౌన్సిలింగ్ కాకుండా సాధారణ కౌన్సెలింగ్ నిర్వహించాలని మహాజన టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చేమూరు మస్తాన్, కార్యదర్శి దూడల పెంచలయ్య అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ విస్మరించి వెబ్ కౌన్సెలింగ్ చేపడతామని చెప్పడం సరికాదన్నారు. అలేగా పదోన్నతుల రిజర్వేషన్లలో ఎస్సీ వర్గీకరణ సక్రమంగా అమలు పరచడం లేదని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో 200 మందికి పైగా మాదిగ ఉద్యోగులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.